## ఎన్టీఆర్ విగ్రహానికి పరకలు

### మంత్రం రాసిన కాగితం అతికించిన దుండగులు
### రాళ్లు రువ్వడంతో దెబ్బతిన్న విగ్రహం


ఎన్టీఆర్ విగ్రహం వద్ద కట్టిన పరకలు, మంత్రం రాసి.. అతికించిన కాగితం

**అనంతపురం అర్బన్, మార్చి 21:** నగరంలోని ఆర్ట్స్ కళాశాల సమీపంలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహం వద్ద గుర్తు తెలియని వ్యక్తులు పరకలు కట్టారు. వాటికి మంత్రం రాసిన కాగితాన్ని అతికించారు. అంతటితో ఆగకుండా విగ్రహంపై రాళ్ల దాడి చేశారు. దీంతో ఎన్టీఆర్ విగ్రహం పాక్షికంగా దెబ్బతింది. అటుగా వెళుతున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు గురువారం ఉదయం దీన్ని గమనించారు. చీపుర్లు, తాంత్రిక మంత్రం రాసిన కాగితాన్ని తొలగించారు. ఎన్టీఆర్ విగ్రహం సమీపంలో పోలీసులు ఏర్పాటు చేసిన పెద్ద సీసీ కెమెరా ఉంది. ఫుటేజీ ఆధారంగా ఈ దుశ్చర్యకు పాల్పడిన దుండగులను గుర్తించి, చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఇంత జరిగినా పోలీసులు దీనిపై స్పందించకపోవడం విమర్శలకు తావిస్తోంది. మంత్రం రాసిన కాగితం వార్డు సర్వే రిపోర్టు రాసేందుకు తయారు చేసిన రికార్డులో నుంచి చించినది కావడం గమనార్హం. వీటిని వలంటీర్లు వినిగించేందుకు ఇచ్చినట్లు కనిపిస్తోంది.


ఎన్టీఆర్ విగ్రహంపై రాళ్లతో దాడిచేసిన ఆనవాళ్లు, దెబ్బతిన్న విగ్రహం

**ఉష్ణోగ్రతలు** (గురు)
గరిష్ఠం : 36.0
కనిష్ఠం : 24.0

## కౌలు రైతు ఆత్మహత్య


సంజీవ్‌కుమార్ (ఫైల్)

**గార్లదిన్నె, మార్చి 21:** గార్లదిన్నె మండల కేంద్రంలో కౌలు రైతు సంజీవ్ కుమార్(35) గురువారం ఆత్మహత్య చేసుకున్నారు. శింగనమల మండలం వెస్ట్ నరసాపురం గ్రామానికి చెందిన సంజీవ్ కుమార్, నిర్మల దంపతులు అదే గ్రామంలో ఐదు ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకుని వేరుశనగ, ఆముదం పంటలు సాగు చేశారు. పంటల దిగుబడి సరిగా రాక తీవ్రంగా నష్టపోయారు. దీంతో పెట్టుబడి కోసం తెచ్చిన అప్పులు తీర్చలేక ఒత్తిడికి లోనయ్యారు. ఈ నేపథ్యంలో గార్లదిన్నె శివారు ప్రాంతంలో సంజీవ్ కుమార్ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ గౌస్ బాషా తెలిపారు.







## వైసీపీ అభ్యర్థులకు జనం నిలదీతలు

- ఐదేళ్లలో ఏం చేశారో చెప్పాలని ప్రశ్న
- టీడీపీలోకి పెరుగుతున్న వలసలు
- ప్రచారంలో దూసుకుపోతున్న కూటమి
- టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణుల్లో జోష్
- ప్రజలను ఆలోచింపజేస్తున్న సూపర్ సిక్స్ పథకాలు



టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి దూకుడుతో జిల్లాలో వైసీపీ అభ్యర్థులు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. వలంటీర్లే సర్వస్వం అని నమ్ముకుని.. జనాల్లోకి వెళుతున్న వైసీపీ అభ్యర్థులకు చుక్కెదురవుతోంది. వలంటీర్లు ప్రచారంలో పాల్గొనకూడదని ఎన్నికల సంఘం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ప్రచారంలో పాల్గొంటున్నవారిపై వేటు పడుతోంది. వారిని ఉద్యోగాల నుంచి తొలగిస్తున్నారు. మరోవైపు టీడీపీలోకి వైసీపీ శ్రేణుల వలసలు పెరిగాయి. ఐదేళ్ల పాలనలో జగన్ నొక్కిన బటన్‌లనే నమ్ముకున్న వైసీపీ అభ్యర్థులకు జనం నుంచి నిలదీతలు ఎదురవుతున్నాయి. సంక్షేమ పథకాలతో లబ్ది చేకూర్చడం కాదు... అభివృద్ది ఎక్కడ చేశారో చూపాలని జనం ప్రశ్నిస్తున్నారు. ఒక్క పరిశ్రమను తీసుకురాలేదని, యువతకు ఉపాధి చూపకుండా మళ్లీ ఓట్లు ఎలా అడుగుతారని నిలదీస్తున్నారు. దీంతో వైసీపీ అభ్యర్థులు దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. ప్రజల నుంచి ఎదురవుతున్న ప్రశ్నలకు బదులివ్వలేక, పార్టీని వీడి టీడీపీలోకి వలస వెళ్తున్న శ్రేణులను కాపాడుకోలేక వైసీపీ అభ్యర్థులు తంటాలు పడుతున్నారు. ఐదేళ్ల పాలనలో భయపెడుతూ, బుజ్జగిస్తూ కాలం గడిపిన వైసీపీ.. సార్వత్రిక ఎన్నికల్లో గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటోందని విశ్లేషకులు అంటున్నారు.

\- ఆంధ్రజ్యోతి, అనంతపురం



# ఉక్కిరి.. బిక్కిరి..

### ఏం చేయాలి..?

అధికారంలో ఉన్నన్నాళ్లు మాయమాటలు చెప్పారు. అమలుగాని హామీలతో కాలం నెట్టుకొచ్చారు. జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాలకుగానూ ఏకంగా ఏడు స్థానాలలో వైసీపీ అభ్యర్థులను ప్రజలు గెలిపించారు. రాష్ట్రంలోనూ ఆ పార్టీ అధికారాన్ని చేపట్టింది. వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి గత సార్వత్రిక ఎన్నికలకు ముందు పాదయాత్రలో ఇచ్చిన హామీలు, ముఖ్యమంత్రి హోదాలో జిల్లాకు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ నెరవేర్చలేదు. మెజార్టీ సిట్టింగ్ ఎమ్మెల్యేలకు ప్రస్తుతం టిక్కెట్లు వచ్చాయి. ఎన్నికల బరిలో నిలిచిన ఎమ్మెల్యేలు.. తమ నియోజకవర్గాల్లో ఇచ్చిన హామీలను కూడా నెరవేర్చలేకపోయారు. అధినేత ఇచ్చిన హామీలు, తాము ఇచ్చిన హామీలు నీటి మూటలుగా మిగిలిపోవడంతో అభ్యర్థులను సంకటస్థితిని ఎదుర్కొంటున్నారు. ఐదేళ్ల పాలనలో హెచ్చెల్సీ ఆధునికీకరణ ఊసెత్తలేదు. గంపెడు మట్టి తీయలేదు. హంద్రీనీవా సామర్థ్యాన్ని 10 వేల క్యూసెక్కులకు పెంచుతామని ఇచ్చిన మాట నెరవేరలేదు. పేరూరు, భైరవాన్‌తిప్ప ప్రాజెక్టులకు నిధులివ్వలేదు. కొత్త రిజర్వాయర్ల నిర్మాణం శంకుస్థాపనలకే పరిమితమైంది. రాప్తాడు సమీపంలో జాకీ పరిశ్రమ ఏర్పాటయ్యుంటే నాలుగు వేల మంది మహిళలకు ఉపాధి లభించేది. అది పక్క రాష్ట్రానికి తరలిపోవడానికి వైసీపీ నేతలే కారణమయ్యారనే ఆరోపణలు ఉన్నాయి. ఇలా ఉపాధికి గండి కొట్టారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే దిశగా ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. ఇలా చెప్పుకుంటూపోతే... ఏ ఒక్క హామీ అమలుకు నోచుకోలేదు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో జనంలోకి ఎలా వెళ్లాలో తెలియక వైసీపీ అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు.




### వలసల వెల్లువ

జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో వైసీపీ నుంచి టీడీపీలోకి వలసలు వెల్లువెత్తుతున్నాయి. టీడీపీ అధినాయకత్వం అభ్యర్థులను ప్రకటించక ముందు నుంచే నియోజకవర్గ ఇన్‌చార్జిలు ప్రజల్లోకి వెళ్లడం ప్రారంభించారు. బాబు ష్యూరిటీ... భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించారు. రాయదుర్గం, రాప్తాడు, ఉరవకొండ, కళ్యాణదుర్గం, తాడిపత్రి, శింగనమల నియోజకవర్గాలకు టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు అభ్యర్థులను ప్రకటించారు. రాయదుర్గంలో మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు, ఉరవకొండలో సిట్టింగ్ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్, రాప్తాడులో మాజీ మంత్రి పరిటాల సునీత, తాడిపత్రిలో అస్మిత్‌రెడ్డి, శింగనమలలో బండారు శ్రావణిశ్రీ, కళ్యాణదుర్గంలో అమిలినేని సురేంద్రబాబులు ప్రచారాన్ని చేపట్టారు. ఈ నేపథ్యంలో వైసీపీలోని అసంతుష్టులు, ఆ పార్టీ సానుభూతిపరులు, కార్యకర్తలు వైసీపీని వీడి టీడీపీలో చేరిపోతున్నారు. రోజురోజుకూ టీడీపీలోకి చేరికలు అధికమవుతున్నాయి. దీంతో వైసీపీ అభ్యర్థులు తలలు పట్టుకుంటున్నారు. గత ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థుల కోసం కష్టపడి పనిచేశామని, గెలిచిన తరువాత ఎమ్మెల్యేలు తమను ఏమాత్రం గుర్తించలేదన్న అసంతృప్తి వైసీపీ ద్వితీయశ్రేణి నాయకత్వంలో స్పష్టంగా కనిపిస్తోంది. ఈ పరిస్థితి జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల్లోనూ ఉందని ఆ పార్టీవారే అంటున్నారు. ఇవన్నీ ఒకెత్తయితే.. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి మెజార్టీ స్థానాలు దక్కుతాయని, కూటమి అధికారం చేపట్టబోతోందని అనేక సర్వే సంస్థలు చెబుతున్నాయి. ఈ పరిణామాలు వైసీపీ అసంతుష్టులు టీడీపీలోకి చేరడానికి ప్రధాన కారణమవుతున్నాయి. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యే నాటికి టీడీపీలోకి వలసలు మరింత పెరిగే అవకాశం ఉందని అంటున్నారు.



### దూసుకుపోతున్న కూటమి అభ్యర్థులు

అధికారంలో ఉన్నన్నాళ్లు వైసీపీ పాలకులు అభివృద్ధిని పట్టించుకోలేదు. ప్రస్తుతం ప్రజలకు ఏం ప్రయోజనాలు చేకూర్చామో చెప్పుకోలేని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. మరోవైపు ప్రచారంలో టీడీపీ కూటమి అభ్యర్థులు దూసుకుపోతున్నారు. సూపర్ సిక్స్ పథకాలను విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ప్రజలను ఆలోచింపజేస్తున్నారు. పార్టీ శ్రేణులను చైతన్యపరుస్తూ ముందుకు సాగుతున్నారు. అన్ని వర్గాల ప్రజలను ఆకర్షించేవిధంగా సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను ముద్రించి, ప్రతి ఇంటి గుమ్మానికి చేరుస్తున్నారు. వైసీపీ ఐదేళ్ల అరాచక పాలనను ఎండగడుతున్నారు. సూపర్ సిక్స్ పథకాలతో మహిళలు, విద్యార్థులు, నిరుద్యోగ యువత, రైతులు, రైతుకూలీలతో పాటు అన్ని వర్గాల ప్రజలకు చేకూర్చే ప్రయోజనాలను ప్రజలకు వివరిస్తూ దూసుకుపోతున్నారు. టీడీపీ అభ్యర్థుల ప్రచారజోరుకు వైసీపీ నుంచి వలసల జోరు తోడవుతోంది. ఎన్నికలు మరో 50 రోజులకుపైగా ఉండటంతో టీడీపీ గ్రాఫ్ ప్రజల్లో మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.




ఆత్మకూరు మండలం పి.కొత్తపల్లిలో టీడీపీ మండల ఇన్‌చార్జి బాలాజీ సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ శ్రేణులు


రాయదుర్గం పట్టణంలో టీడీపీ అభ్యర్థి కాలవ శ్రీనివాసులు సమక్షంలో అజయ్ టైలర్స్ రఘునాథ్ ఆధ్వర్యంలో టీడీపీలోకి చేరికలు..

# రాగి జావ.. ప్రచార యావ..!

- గోరుముద్ద సరుకులపై జగన్ ముద్ర
- వంట పాత్రలు.. గ్లాసులపై కూడా...
- యథేచ్ఛగా ఎన్నికల కోడ్ ఉల్లంఘన
- పాఠశాలల పర్యవేక్షణ మరిచిన విద్యాశాఖ అధికారులు

**అనంతపురం విద్య, మార్చి 21:** వైసీపీ ప్రచార పిచ్చి పీక్స్‌కు చేరింది. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా ఏమాత్రం మార్పు కనిపించడం లేదు. సీఎం జగన్ బొమ్మలు, ఆయన పేర్లు నేటికీ ప్రభుత్వ పథకాలలో దర్శనం ఇస్తూనే ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందజేస్తున్న రాగి జావను కూడా ప్రచారానికి వాడుకుంటున్నారు. ఒకటి నుంచి పదో తరగతి వరకూ విద్యార్థులకు ఇచ్చే రాగి జావ గ్లాసులు, వంట పాత్రలపై 'జగనన్న గోరుముద్ద' అని అచ్చు వేయించారు. రాగిజావ తయారు చేసే స్టీల్ పాత్రలపైనా ఇదే ఉంది. రాగిజావ తయారీలో ఉపయోగించే రాగిపిండి నింపిన కవర్లపై కూడా సీఎం జగన్ ఫొటోను ముద్రించారు. చిక్కీలు నింపిన కార్డ్‌బోర్డ్ బాక్సులపైనా జగన్ కనిపిస్తున్నారు. ఇవన్నీ కోడ్ ఉల్లంఘన కిందకు వస్తాయి. విషయం తెలిసినా విద్యాశాఖ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. హెచ్ఎంలు కూడా పట్టించుకోవడం లేదు. పోలింగ్ కేంద్రాలను పాఠశాలల్లోనే ఎక్కువగా ఏర్పాటుచేస్తారు. అక్కడే ఎన్నికల నియమావళి సక్రమంగా అమలు కాకపోవడం విమర్శలకు తావిస్తోంది.

### 1.99 లక్షల మందికి..

జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ఎయిడెడ్, ఏపీ మోడల్ స్కూళ్లు, మండల పరిషత్, జిల్లా పరిషత్, రైల్వే పాఠశాలలు, మదరసాలు.. ఇలా అన్ని యాజమాన్య పాఠశాలలు 1,694 ఉన్నాయి. వీటి పరిధిలో ఒకటి నుంచి పదో తరగతి వరకూ 1.99 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరందరికీ జగనన్న గోరుముద్ద అందిస్తున్నారు. వారంలో మూడు రోజులు (మంగళ, గురు, శని) విద్యార్థులకు రాగి జావ అందిస్తున్నారు. మిగిలిన మూడు రోజులు (సోమ, బుధ, శుక్ర) చిక్కీలు అందిస్తున్నారు. వీటి మాటున సీఎం జగన్ ప్రచార లబ్ధి పొందుతున్నారు. వీటితోపాటు బడి పిల్లలకు పంపిణీ చేసిన బెల్టులు, పుస్తకాల సంచులపై జగనన్న పేరు స్పష్టంగా కనిపిస్తోంది.


రాగిజావ తాగేందుకు పిల్లలకు ఇచ్చిన స్టీల్ గ్లాసులపై సీఎం జగన్ పేరు

విద్యార్థుల బెల్ట్, బ్యాగులపై జగన్ పేరు





### చోద్యం చూస్తున్నారు..

పదో తరగతి పబ్లిక్ పరీక్షలు జరుగుతున్నాయి. డీఈఓ వంటి ఉన్నతాధికారులు పరీక్షల విధుల్లో బిజీగా ఉన్నారు. పాఠశాలల్లో కోడ్ అమలు గురించి పర్యవేక్షించే తీరిక ఉండకపోవచ్చు. కానీ, క్షేత్రస్థాయిలో, కార్యాలయాల్లో ఉండే అధికారులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారు. డీఈఓ కార్యాలయంలో ఉండే ఓ ఏడీ.. కుర్చీకే పరిమితమయ్యారు. గతంలో బాగానే వెనకేసుకున్న ఆయన.. పనిచేయాల్సిన టైంలో కదలడం లేదు. ఎన్నికల నియమావళి ఉల్లంఘనలను అడ్డుకోవడం తన విధి కాదన్నట్లు నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నారు. ఇలాంటి వారిని క్షేత్రస్థాయికి పంపి.. కోడ్ అమలవుతోందో లేదో పర్యవేక్షించే అవకాశం ఉంది. కానీ ఆ దిశగా చర్యలు లేవని డీఈఓ కార్యాలయ ఉద్యోగులే చర్చించుకుంటున్నారు. డిప్యూటీ డీఈఓలు, ఎంఈఓలు సైతం ఎంసీసీ అమలు గురించి పెద్దగా పట్టించుకోవడం లేదు. ఉన్నతాధికారులు స్పందించాల్సిన అవసరం ఉంది.




రాగి పిండి కవర్లపై జగన్ చిత్రాలు

## అధికార పార్టీ సేవలో..!



ఈ ఫొటోలోని వృత్తంలో ఉన్న వ్యక్తి బొమ్మనహాళ్ మండలం ఉంతకల్లు గ్రామానికి చెందిన స్టోర్ డీలర్ గాదిలింగ. వైసీపీ రాయదుర్గం అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి నిర్వహించిన పార్టీ కార్యక్రమంలో గురువారం ఆయన పాల్గొన్నారు. ప్రభుత్వం నుంచి వేతనం, పారితోషికం పొందేవారు ఎవరూ రాజకీయ పార్టీల కార్యక్రమాల్లో పాల్గొనకూడదని ఎన్నికల సంఘం ఆదేశించింది. అయినా, వలంటీర్లు, స్టోర్ డీలర్లు, ఉపాధి హామీ సిబ్బంది, కొందరు ప్రభుత్వ ఉద్యోగులు ఖాతరు చేయడం లేదు. అధికార పార్టీ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటూనే ఉన్నారు. అధికారులు చర్యలు తీసుకుంటున్నా.. ఏమాత్రం తగ్గడం లేదు.

\- బొమ్మనహాళ్ (మరిన్ని వివరాలు 7లో..)

## వైసీపీ వాడుకుని వదిలేస్తుంది..!

- వలంటీర్లు నిష్పక్షపాతంగా ఉండాలి
- మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు



**రాయదుర్గం, మార్చి 21:** వలంటీర్లు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని, వైసీపీ ప్రచారంలో పాల్గొన వద్దని, ఆ పార్టీ అభ్యర్థుల వెంట తిరగొద్దని మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు కోరారు. పట్టణంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల నియమావళికి విరుద్ధంగా వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్న వలంటీర్లు, స్టోర్ డీలర్లపై ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవడం ప్రారంభించిందని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ ప్రచారంలో కొందరు వలంటీర్లు భాగస్వాములు అవుతున్నారని అన్నారు. వలంటీర్ల వ్యవస్థను టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత రద్దు చేయబోమని స్పష్టం చేశారు. ఇప్పటికంటే బాగా చూసుకుంటామని అన్నారు. పార్టీలకతీతంగా ప్రభుత్వ ప్రతినిధులుగా, నిష్పక్షపాతంగా పనిచేయాలని కోరారు. వైసీపీ నాయకుల ప్రలోభాలకు, ఒత్తిళ్లకు తలొగ్గి తప్పు చేస్తే ఎవరూ కాపాడలేరని పదే పదే చెబుతున్నామని అన్నారు. అయినా కొంతమంది తీరు మార్చుకోకుండా వైసీపీ అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి వెంట ప్రచారంలో పాల్గొంటున్నారని, ఓటర్లను ప్రలోభ పెట్టే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ఇప్పటికే నివేదికలు అందుకున్న అధికారులు, ఎనిమిదిమందిపై చర్యలు తీసుకున్నారని, వారు ఉపాధిని కోల్పోయారని గుర్తు చేశారు. వైసీపీ నాయకులు వాడుకుని వదిలేస్తారని హెచ్చరించారు.

### ఇదీ.. వైసీపీ రంగు..!

చెన్నేకొత్తపల్లి మండలంలోని బసినేపల్లి క్రాస్ వద్ద నిర్మించిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం షెడ్డు ఇది. దీనికి వేసిన వైసీపీ రంగులను ఇప్పటికీ తొలగించలేదు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినందున.. రాజకీయ పార్టీల జెండాలు, ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు వంటివి తొలగించాలని, సాధ్యం కాకపోతే కప్పిపెట్టాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. కానీ ఇంత పెద్ద షెడ్డుకు వేసిన అధికార పార్టీ రంగులను మూసివేయడం, తొలగించడం ఖర్చు, శ్రమతో కూడుకున్న పని. అధికారులు ఏదో ఒకటి చేస్తారా.. ఇలాగే వదిలేస్తారా.. అన్న చర్చ జరుగుతోంది. ఇలాంటివి జిల్లా వ్యాప్తంగా చాలానే ఉన్నాయి. ప్రభుత్వ భవనాలకు వైసీపీ రంగులు వేయడం సరికాదని కోర్టు కూడా చెప్పింది. వెంటనే తొలగించాలని అధికారులను ఆదేశించింది. కానీ చాలాచోట్ల అమలు కాలేదు.

\- చెన్నేకొత్తపల్లి






| | | |
|---|---|---|
| ఇఫ్తార్ | శుక్రవారం సాయంత్రం | 06:32 |
| సెహరీ | శనివారం ఉదయం | 05:05 |

# కోడ్ అమలు ప్రకటనలకే పరిమితమా..?

## వైసీపీ అభ్యర్థుల తరపున వలంటీర్లు, డీలర్లు, ఐకేపీ సిబ్బంది అడ్డగోలుగా ప్రచారం

### ఉన్నతాధికారుల మౌనంపై విమర్శలు

**అనంతపురం టౌన్, మార్చి 21:** జిల్లాలో ఎన్నికల కోడ్ అమలు కేవలం ప్రకటనలకే పరిమితమా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కోడ్ అమలుకు అది చేపట్టాం.. ఇది చేస్తున్నాం.. ఎక్కడా నిర్లక్ష్యం చేయం.. ఎవరైనా కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు అంటూ నిత్యం ఉన్నతాధికారులు, ఎన్నికల నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్లు గొప్పగా చెబుతున్నారు. కోడ్ అమలుకు ప్రత్యేక టీంలను ఏర్పాటుచేశారు. కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు చేసి పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమించారు. అయినా వలంటీర్లు బరితెగించి వైసీపీ నాయకుల తరఫున ప్రచారంలో పాల్గొంటున్నారు. ప్రభుత్వం నుంచి గౌరవ వేతనం పొందుతున్నారు కాబట్టి వలంటీర్లు, డీలర్లు, యానిమేటర్లు ఎన్నికల నిబంధనల కిందకు వస్తారని, వారు ఎన్నికల ప్రచారంలో పాల్గొనకూడదని, ప్రచారం చేస్తే చర్యలు తీసుకోవాలని అధికారికంగా ప్రకటించారు. మరోవైపు ఎన్నికల్లో ఏజెంట్లుగా కూర్చోవడానికి లేదని తెలిపింది. అయినా వలంటీర్లకు ముకుతాడు వేసేవారే కరువయ్యారు. వారి ఆగడాలకు హద్దూ అదుపు లేకుండా పోయిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

● శింగనమల మండలం రాచేపల్లి పంచాయతీ కార్యదర్శి (బీఎల్‌ఓ) డొక్క క్రిష్ణ వైసీపీ నాయకుల ప్రచారంలో పాల్గొన్నారు. ఆధారాలతో బయటపడగా ఎంపీడీఓ కేవలం నోటీస్ ఇచ్చి చేతులు దులుపుకున్నారు. సంబంధిత ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

● బొమ్మనహాళ్ మండల పరిధిలోని దేవగిరి, హరేసముద్రం గ్రామాల్లో వైసీపీ పార్టీ అభ్యర్థి, ఆ పార్టీ నాయకులతో వలంటీర్లు రాముడు, వన్నూరుస్వామి, నాగరాజు, ఐకేపీ యానిమేటరు నాగరాజు ప్రచారంలో పాల్గొన్నారు.

● శింగనమల మండలం జలాలపురం గ్రామానికి చెందిన వలంటీరు వెంకటేష్ వైసీపీ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆధారాలతో పత్రికల్లో కూడా ప్రచురితమైంది. అయితే అధికారులు ఏమాత్రం చర్యలు తీసుకోలేదు.

**ఎవరినీ ఉపేక్షించం**

ఎన్నికల నిబంధనల అమలులో ఎక్కడా రాజీపడం. ఉల్లంఘించిన వారిని ఉపేక్షించం. వలంటీర్లు, డీలర్లు, ఐకేపీ, డ్వామా సిబ్బందితోపాటు ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులు, కాంట్రాక్ట్ ఉద్యోగులు కోడ్ కిందకు వస్తారు. వారు రాజకీయ కార్యక్రమాల్లో, ప్రచారాల్లో పాల్గొనకూడదు. పాల్గొంటే అలాంటివారిపై తప్పకుండా చర్యలు తీసుకుంటాం. నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులకు పూర్తి అధికారాలు ఇచ్చాం. ఇప్పటికే కొందరు వలంటీర్లు, డీలర్లపై చర్యలు తీసుకోవడం జరిగింది. ఎవరు ఎలాంటి అనుమానాలు పెట్టుకోవాల్సిన అవసరంలేదు. ఆధారాలతో ఫిర్యాదులొస్తే చర్యలు తప్పవు.

**- కలెక్టర్ గౌతమి**



● గుమ్మఘట్ట మండలంలో వలంటీరు హనుమంతు వైసీసీ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటూ అడ్డంగా దొరికారు. అయినా ఎటువంటి చర్యలు తీసుకోలేదు.

ఇవి కేవలం మచ్చుకు మాత్రమే. జిల్లాలోని ఏ నియోజకవర్గంలోని ఏ గ్రామంలో చూసినా ఇలాంటి దృశ్యాలే కనిపిస్తున్నాయి. 123, 129., 134(ఏ) ప్రకారం కోడ్ ఉల్లంఘన కిందకు వస్తుంది. అవసరమైతే ఐపీసీ171 సెక్షన్ కింద కేసుకూడా నమోదు చేయవచ్చని చెబుతున్నారు.

### మౌనమేల..?

జిల్లాలో యథేచ్ఛగా ఎన్నికల కోడ్ ఉల్లంఘన చేస్తున్నా ఎలాంటి చర్యలు తీసుకోకుండా ఉన్నతాధికారులు మౌనంగా ఉంటుండడంపై పార్టీలు, ప్రజల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. వలంటీర్ల ప్రచారాలకు సంబంధించి ఆధారాలతో బయటపెడుతున్నా ఎందుకు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ప్రశ్నిస్తున్నారు.

## యథేచ్ఛగా ఉల్లంఘన



అనంతపురం రహదారిలో విద్యుత్‌స్తంభానికి కాంగ్రెస్‌పార్టీ జెండా

**ఉరవకొండ:** ఎన్నికల నియమావళిలో భాగంగా రాజకీయ పార్టీలకు సంబంధించిన జెండాలు, హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలను తొలగించాలన్న ఆదేశాలు ఉన్నా అవి అమలు కావడం లేదు. అనంతపురం-బళ్లారి జాతీయరహదారిపై హంద్రీనీవా కాలువ వద్ద పార్టీల జెండాలు అలాగే దర్శనమిస్తున్నాయి. వజ్రకరూరు మండలంలోని చాబాలలో అంగన్‌వాడీ సెంటర్‌లో వైఎస్సార్ సంపూర్ణపోషణ కింద పంపిణీ చేసిన పాల ప్యాకెట్లను జగన్‌ఫొటోలతోనే అందజేశారు. ఫొటోలను కనిపించకుండా చేసి పంపిణీ చేయాలని సూచించినా అదేవిధంగా వాటిని అందజేయడం గమనార్హం.



జగన్ ఫొటో ఉన్న పాలప్యాకెట్లు

## డీలర్ ప్రచారం



వైసీపీ శింగనమల అభ్యర్థి వీరాంజనేయులుకు మద్దతుగా ప్రచారం చేస్తున్న డీలర్ భాస్కర్

**బుక్కరాయసముద్రం:** శింగనమల నియోజకవర్గం వైసీపీ అభ్యర్థి వీరాంజనేయులుకు మద్దతుగా మండల పరిధిలోని పి కొత్తపల్లి గ్రామం చౌకధాన్యపు డీలర్ భాస్కర్ గురువారం ప్రచారం చేపట్టాడు. బుక్కరాయసముద్రం పంచాయతీలోని పలుకాలనీల్లో వైసీపీ చేపట్టిన ప్రచారంలో డీలర్లు సంఘం ఉపాధ్యక్షుడు భాస్కర్ ప్రచారం చేశాడు. ఎన్నికల సంఘం ఆదేశించినా నియమావళిని లెక్కచేయకుండా మండలంలో స్టోర్ డీలర్లు యథేచ్ఛగా వైసీపీ అభ్యర్థి తరుపున ప్రచారం చేస్తున్నారు. అయినా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని టీడీపీ నేతలు ఆరోపిస్తున్నారు.

# తగ్గని వలంటీర్లు..!

## వైసీపీ తరపున ప్రచారం...

### విధుల నుంచి పలువురి తొలగింపు

**అనంతపురం క్రైం/అర్బన్/కొత్తచెరువు/ఓబుళదేవరచెరువు, మార్చి 21:** ఎన్నికల కమిషన్ ఆదేశాలు వలంటీర్ల చెవికెక్కినట్లు కనిపించడం లేదు. వారిపై అధికారులు చర్యలు తీసుకుంటున్నా వైసీపీ ప్రచారంలో పాల్గొనడానికి ఏమాత్రం వెనుకాడటం లేదు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో అధికార పార్టీకి అనుకూలంగా వలంటీర్ల ప్రచారాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో గురువారం కూడా పలువురిపై అధికారులు చర్యలు తీసుకున్నారు.

● అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే అనంతవెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికీ వైసీపీ పేరుతో ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రతి రోజూ సంబంధిత డివిజన్ల పరిధిలో వలంటీర్లు ప్రచారాల్లో పాల్గొంటున్నారు. అనంతపురం నగరంలోని 27, 28 డివిజన్‌లలో గురువారం నిర్వహించిన ప్రచారంలో వలంటీర్లు మున్ని, బంగి వనజ, సుమతి, విజయకుమారి, ఆలేఖ్య, కప్పల విజయ, చంద్రకళ, పార్వతి, వలి, చలమల శిరీష, షేక్ షబానాజ్మీ, ఇండ్ల అజయ్ జాసన్, సుకన్య అన్నపూర్ణ, శబనాజ్, సుజాత, కుళ్లాయమ్మ, అబ్బాస్ పాల్గొన్నారు. దీంతో వైసీపీ ఎన్నికల ప్రచారానికి హాజరైన వలంటీర్లపై చర్యలు తీసుకోవాలని అనంతపురం ఆర్డీఓ వెంకటేష్‌కు టీడీపీ నాయకులు ఫిర్యాదు చేశారు. టీడీపీ నాయకులు ముక్తియార్, గోపాల్‌గౌడ్, వన్నూరప్ప, బోయపాటి బాలప్ప, శ్రీకాంత్, చెరుకుతోట పవన్‌కుమార్ ఆర్డీఓను కలిసి ఆధారాలతో ఫిర్యాదు చేశారు.



ఎమ్మెల్యే పక్కన వలంటీర్ అబ్బాస్



ప్రచారంలో వలంటీర్ కుళ్లాయమ్మ



ఆర్‌డీఓకు ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నాయకులు

● శ్రీ సత్యసాయి జిల్లా ఓబుళదేవరచెరువు మండలంలోని తుమ్మలకుంట్లపల్లిలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వలంటీర్లు ఆదినారాయణ, నరసింహులును అధికారులు విధుల నుంచి తొలగించారు. మరో ఇద్దరికి ఎంపీడీఓ వరలక్ష్మి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. కొత్తచెరువు మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన వైసీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వలంటీర్లు గోరంట్లపల్లి హర్షద్, సాయి ప్రకాష్‌ను విధుల నుంచి తొలగించామని ఇన్‌చార్జి ఎంపీడీఓ సిద్దారెడ్డి గురువారం తెలిపారు. ఈ రెండు మండలాల్లో వలంటీర్ల ఎన్నికల ప్రచారంపై ఆంధ్రజ్యోతిలో కథనాలు ప్రచురితమయ్యాయి. దీంతో అధికారులు స్పందించారు.

● తాడిపత్రి పట్టణంలో వలంటీర్లుగా పనిచేస్తున్న అమూల్య, నాగసులోచన, మల్లేశ్వరరెడ్డి, దాదాపీరాలను ఎన్నికల కమిషన్ విధుల నుంచి తొలగించింది. పట్టణంలోని శ్రీనివాసపురం, సంజీవనగర్ ప్రాంతాల్లో వీరు ఓటర్ వెరిఫికేషన్ చేస్తుండటంతో కోడ్ ఉల్లంఘించారని పలువురు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదుచేశారు. విచారించిన ఆర్ఓ రాంభూపాల్‌రెడ్డి నివేదికను ఎన్నికల కమిషన్‌కు పంపగా కమిషన్ ఆదేశాల మేరకు గురువారం వారిని విధుల నుంచి తొలగించారు.



అనంత అర్బన్‌లో వైసీపీ తరపున ప్రచారం చేస్తున్న వలంటీర్లు

## ఉంతకల్లులో అమలు కాని ఎన్నికల కోడ్




విలేజ్ క్లినిక్‌కు వైఎస్సార్ పేరు కనిపిస్తున్న దృశ్యం

**బొమ్మనహాళ్:** ఎన్నికల నియమావళిని కొందరు అధికారులు బేఖాతరు చేస్తున్నారు. పలు గ్రామాల్లో శిలాఫలకాలు, రైతుభరోసా, విలేజ్ క్లినిక్, పాలడైరీలకు వైసీపీ నేతల పేర్లు దర్శనమిస్తున్నాయి. మండలంలోని ఉంతకల్లు గ్రామంలో రైతుభరోసా, ఆర్బీకేకు వైఎస్సార్ పేరు అలాగే ఉంది. జగనన్న పాలవెల్లువ మహిళా డైరీ సహకార సంఘం అని అలానే ఉంచారు. వైఎస్సార్ విలేజ్ క్లినిక్ కూడా అలాగే ఉంచారు. ఇటీవల ప్రారంభించిన శిలాఫలకం కూడా అలాగే దర్శనమిస్తోంది. గ్రామంలో ఎన్నికల కోడ్ అమలు కావడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సచివాలయ భవనానికి జగన్ ఫోటో కనిపించకుండా స్టిక్కర్ మాత్రమే వేసి సంక్షేమ పథకాలు కనిపించేలా వదిలేశారు. వాటిని తొలగించాల్సి ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో వైసీపీ అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి సొంత గ్రామమైన ఉంతకల్లులో ఎన్నికల కోడ్ అమలులోకి రాదా అని కొందరు ప్రశ్నిస్తున్నారు.



క్లినిక్ వద్ద శిలాఫలకం




జగన్ పేరు..

## స్మార్ట్ మీటర్లపై జగనన్న బొమ్మ

**ధర్మవరం రూరల్:** మండలవ్యాప్తంగా రైతులకు సంబంధించిన మోటర్లకు స్మార్ట్‌మీటర్లను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ మీటర్లుకు జగనన్న బొమ్మతో కూడిన నవరత్నాల స్టిక్కర్లు అతికించారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో మీటర్లకు జగనన్న స్టిక్కర్లు ఉండటంతో పలువురు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. వీటికి ఎన్నికల కోడ్ వర్తించదా అని ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఎన్నికల కోడ్ అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



## వైసీపీ ఆత్మీయ సమావేశంలో వలంటీర్

**కణేకల్లు:** మండల కేంద్రంలో గురువారం జరిగిన వైసీపీ ఆత్మీయ సమావేశంలో రామ్‌నగర్‌కు చెందిన వలంటీర్ గంగాధర్ పాల్గొన్నారు. స్థానిక వైసీపీ కార్యాలయం వద్ద ఆత్మీయ సమావేశం నిర్వహించగా వలంటీర్ పాల్గొనడం విమర్శలకు తావిస్తోంది. కొంతమంది స్టోర్‌డీలర్లు, యానిమేటర్ల భర్తలు, వలంటీర్ల భర్తలు సమావేశంలో పాల్గొన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలు స్పష్టంగా ఉన్నా వలంటీర్లు ఏమాత్రం తగ్గకుండా వైసీపీ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు.



సమావేశంలో పాల్గొన్న వలంటీర్

## ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న బొలెరో

### తండ్రి మృతి... ఇద్దరు కుమారులకు తీవ్రగాయాలు



బోల్తాపడ్డ బొలెరో వాహనం



గోపాల్ (ఫైల్)

**కళ్యాణదుర్గంరూరల్, మార్చి 21:** అతివేగంతో వస్తున్న బొలెరో ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా ఇద్దరు గాయపడ్డారు. గురువారం పట్టణంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. కంబదూరు మండలం ఎగువపల్లికి చెందిన గొల్ల గోపాల్ (44) పొట్టకూటి కోసం పట్టణానికి 20 సంవత్సరాల క్రితం వచ్చాడు. టైలర్‌గా జీవనం సాగిస్తూ స్థిరపడ్డాడు. పార్వతినగర్‌లో మూడు సంవత్సరాల క్రితం ఇంటిని నిర్మించుకుని నివాసం వుంటున్నాడు. గోపాల్ కుమారులు తరుణ్ పదవ తరగతి చదువుతుండగా తేజేశ్వర్ నాలుగవ తరగతి చదువుతున్నాడు. గురువారం కుమారులను స్కూలుకు ద్విచక్రవాహనంలో తీసుకెళ్తుండగా అనంతపురం నుంచి పైపులతో వస్తున్న బొలెరో ఢీకొంది. దీంతో గోపాల్ అక్కడికక్కడే మృతి చెందగా అతడి కుమారులు తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే వారిని చికిత్స నిమిత్తం కళ్యాణదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసును మోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## 654 లైసెన్స్డ్ ఆయుధాలు డిపాజిట్

### - ఎస్పీ అన్బురాజన్

**అనంతపురం క్రైం, మార్చి 21:** జిల్లాలో ఇప్పటివరకు 654 లైసెన్స్ ఆయుధాలు డిపాజిట్ చేయించామని ఎస్పీ అన్బురాజన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 703 లైసెన్స్ హోల్డర్లు ఉన్నారన్నారు. ఎన్నికల వేళ పోలీస్‌స్టేషన్ స్థాయిలో ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపి జిల్లాలో ఇప్పటివరకు 654 లైసెన్స్ ఆయుధాలు డిపాజిట్ చేయించామన్నారు. ఇంకా 80 ఆయుధాలు డిపాజిట్ చేయాల్సి ఉందన్నారు. ఇందులో 77 ఆయుధాలు బ్యాంకుల సెక్యూరిటీ సిబ్బందితో ఉన్నాయన్నారు. మిగతా 3 ఆయుధాలు కలిగిన వారు వేరే రాష్ట్రాలలో ఉన్నట్లు గుర్తించామని, వారికి సైతం త్వరగా డిపాజిట్ చేయాలని సూచించామన్నారు. ఎన్నికల వేళ ఎవరైనా ప్రలోభపెట్టినా, ఓటర్లకు, రాజకీయ పార్టీల నాయకులకు భద్రతా పరమైన సమస్యలున్నా, అనధికారికంగా ఎవరైనా ఆయుధాలు కలిగి ఉన్నట్లు తెలిసినా వెంటనే తన ఫోన్ నెంబర్ 9440796800కు లేదా జిల్లా స్పెషల్ బ్రాంచి కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక విభాగం నెంబర్ 9392918293కు సమాచారం చేరవేయాలన్నారు. వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

# హంస వాహనంపై విహరించిన ఖాద్రీశుడు



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు



స్వామివారికి హారతి ఇస్తున్న అర్చకులు

**కదిరి, మార్చి 21:** బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామివారు హంసవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నిత్యపూజ, హోమం, అనంతరం శ్రీవారిని తిరుమాడవీధుల్లో ఊరేగించారు. సంధ్యా సమయంలో శ్రీవారు హంసవాహనంపై విహరించారు. కల్యాణోత్సవ తదుపరి రోజు శ్రీవారు తిరువీధుల్లో విహరించడానికి హంసను నారసింహుడి వాహనంగా బ్రహ్మదేవుడు పంపుతారని భక్తుల నమ్మకం. హంస పాలను నీటిని ఎలా వేరు చేస్తుందో అదేవిధంగా నారసింహుడు భక్తుల్లోని మంచి చెడులను వేరు చేసి మంచిని మాత్రమే స్వీకరిస్తారని విశ్వాసం. హంసవాహనంపై విహరిస్తున్న శ్రీవారిని దర్శించుకోవడానికి పట్టణం నుండే కాకుండా వివిధ గ్రామాల నుంచి భక్తులు విచ్చేశారు. ఉత్సవానికి ఉభయదారులుగా తోటంశెట్టి రాజగోపాల్‌శెట్టి కుటుంబ సభ్యులు వ్యవహరించారు. ఉత్సవంలో ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డితోపాటు ఆలయ ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

### నేడు సింహ వాహన సేవ

ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామి వారు సింహవాహనంపై తిరువీధుల్లో భక్తులకు దర్శనమివ్వనున్నారు.

## దరఖాస్తుల ఆహ్వానం

**అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 21:** వేసవి క్రీడ శిక్షణ శిబిరాల నిర్వహణకు ఆసక్తి ఉన్న కోచ్‌లు, పీఈటీలు, సీనియర్ క్రీడాకారులు, సర్టిఫికెట్ కోర్సు చేసినవారు ఈనెల 31వతేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని డీఎస్‌డీఓ షఫీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మే 1వతేదీ నుంచి 31వతేదీ వరకు జిల్లావ్యాప్తంగా 50 సమ్మర్ కోచింగ్ క్యాంపుల నిర్వహణ జరుగుతుందని, ఆసక్తి, అర్హత ఉన్న అభ్యర్థులు పూర్తి వివరాలతో అశోక్‌నగర్‌లోని డీఎస్ఏ ఇండోర్‌స్టేడియంలో అందజేయాలన్నారు. వివరాలకు ఫోన్ నంబరు 08554-353223ను సంప్రదించాలని కోరారు.

## వైసీపీ నాయకుడి ట్రాక్టర్ సీజ్

**డీ.హీరేహాళ్, మార్చి 21:** అక్రమంగా ఇసుక తరలిస్తున్న వైసీపీ నాయకుడి ట్రాక్టర్‌ను పోలీసులు గురువారం సీజ్ చేశారు. మండలంలోని హిర్దేహాళ్ గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు శ్రీకాంత్ తన ట్రాక్టర్‌తో గ్రామ పరిసర ప్రాంతాలలో అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. వెంటనే వారు అక్కడికి వెళ్లి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేశారు. కేసు నమోదు చేశామని, నివేదికను తహశీల్దార్‌కు పంపినట్లు పోలీసులు తెలిపారు.

## పురం ఎంపీ అభ్యర్థిగా బీకే?

### నేడు ప్రకటించే అవకాశం



**పుట్టపర్తి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి):** టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి హిందూపురం ఎంపీ అభ్యర్థిపై నెలకొన్న ఉత్కంఠకు తెరపడినట్లు తెలిసింది. టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారధి పేరు ఖరారు చేసినట్లు ఆ పార్టీ వర్గాల సమాచారం. పెనుకొండ మాజీ ఎమ్మెల్యే అయిన ఆయన మరోసారి అసెంబ్లీకి పోటీ చేయాలని ప్రయత్నించారు. అక్కడ సవితను ప్రకటించారు. టీడీపీ సీనియర్ నాయకుడు, పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో అన్నివర్గాలను కలుపుకొనిపోయే వ్యక్తిగా ఆయనకు పేరుంది. దీంతో పార్టీ అధిష్ఠానం ఆయనను ఎంపీ అభ్యర్థిగా ఖరారు చేసినట్లు తెలిసింది. ఇప్పటికే ఎమ్మెల్యే అభ్యర్థుల పేర్లు ప్రకటించగా, శుక్రవారం ఎంపీ అభ్యర్థుల జాబితా చంద్రబాబు విడుదల చేయనున్నారు. ఈ జాబితాలో బీకే పార్థసారధి పేరును వెల్లడించనున్నట్లు సమాచారం. కొన్ని రోజులుగా హిందూపురం ఎంపీ అభ్యర్థిత్వంపై ఉత్కంఠ నెలకొంది. పొత్తులో భాగంగా బీజేపీకి కేటాయిస్తారన్న ఊహాగానాలు వెలువడ్డాయి. ఆ పార్టీకి చెందిన ఒకరిద్దరు హిందూపురంలో కొన్ని కార్యక్రమాలు కూడా చేశారు. ఆఖరుకు టీడీపీకే ఎంపీ స్థానం కేటాయించడంతో ఉత్కంఠకు తెరపడినట్లయింది. బీకే పార్థసారథిని ఖరారు చేయనున్నట్లు రెండ్రోజుల క్రితమే మీడియాలో రావడంతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున సంబరాలు చేసుకున్నారు.

## 'రబీ పంటనష్టంపై సమగ్ర నివేదికలు పంపండి'

**అనంతపురం అర్బన్, మార్చి 21:** 2023-24 రబీ సీజన్‌లో మెట్టపొలాల్లో పంటనష్టంపై సమగ్ర నివేదికలు పంపాలని జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ ఆదేశించారు. గురువారం ఏడీఏలు, ఏఓలతో ఆమె టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. రబీ సీజన్‌లో జిల్లాలోని 14 మండలాల్లో కరువు ఏర్పడినట్లు ప్రభుత్వం గుర్తించిందన్నారు. ఆయా మండలాల్లో రైతుల వారిగా పంటనష్టం నివేదికలు పంపాలన్నారు.

## ఏప్రిల్ 1 నుంచి విలేజ్ పశుసంవర్ధక సహాయకులకు శిక్షణ

**అనంతపురం అర్బన్, మార్చి 21:** జిల్లాలో కొత్తగా ఉద్యోగం చేరిన విలేజ్ పశుసంవర్ధక సహాయకులకు ఏప్రిల్ 1వతేదీ నుంచి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని పశుసంవర్ధక శాఖ జేడీ సుబ్రహ్మణ్యం గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రెడ్డిపల్లి ప్రాంతీయ పశుశిక్షణ కేంద్రం, జేడీ ఆఫీస్, సాయి నగర్ వెటర్నరీ ఆస్పత్రి, సిద్ధరాంపురం పశుగ్రాస కేంద్రంలో 457 మంది సిబ్బందికి ఆరు బ్యాచులుగా విభజించి, 45 రోజుల పాటు శిక్షణనిస్తామన్నారు.

## రేపు ప్రవీణ్ ప్రకాశ్ రాక

**అనంతపురం విద్య, మార్చి 21:** విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ ఉమ్మడి జిల్లా పర్యటనకు శనివారం వస్తారని తెలిసింది. జిల్లాలో 13 మంది అంధ విద్యార్థులు పదో తరగతి పరీక్షలను రాస్తున్నారు. గతానికి భిన్నంగా, ఎవరి సాయం లేకుండా కంప్యూటర్లు, ల్యాప్‌టాప్స్‌పై వీరు పరీక్షలు రాస్తున్న తీరును ఆయన పరిశీలిస్తారని సమాచారం. కంప్యూటర్లు లేదా ల్యాప్‌టాప్స్ ద్వారా పరీక్షలు రాసేందుకు ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ దేవానందరెడ్డి వీరికి అనుమతి ఇచ్చారు. గత ఏడాది కూడా ఆరుగురు అంధ విద్యార్థులు ఇలాగే పరీక్షలు రాశారు. ఈ ఏడాది నాగరాజుగారి సుమ, సజ్జల దిలీప్, పఠాన్ మదిహా, బెస్త మేఘన, అరవ రవి ఈశ్వర్, చల్లా నిర్మల, కురుబ దీపిక, వడ్డే నవీన్‌కుమార్, జొహరాపురం సాయినాథ్, కట్టుబడి మల్లిక, గట్ల శ్రావణి, అనుబోలు గురుస్వామి, రామన్నగారి భార్గవి డిజిటల్ పరికరాలతో పరీక్షలు రాస్తున్నారు.

# దోచుకోవడమే వైసీపీ లక్ష్యం

## టీడీపీ శింగనమల అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ

**గార్లదిన్నె, మార్చి 21:** దోచుకోవడం... దాడుకోవడమే వైసీపీ ఏకైక లక్ష్యమని... రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే టీడీపీ లక్ష్యమని శింగనమల నియోజకవర్గం టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ పేర్కొన్నారు. గురువారం కృష్ణాపురం, ఇల్లూరు గ్రామాల్లో ద్విసభ్య కమిటీ సభ్యుడు ముంటిమడుగు కేశవరెడ్డితో కలసి ఆమె ఇంటింటా ప్రచారం నిర్వహించారు. నియోజకవర్గానికి నీటి సమస్య పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చిన ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతే పత్తాలేకుండా పోయారని ఎద్దేవా చేశారు. వైసీపీ ఎమ్మెల్యేలు, నాయకులు రాష్ట్ర అభివృద్ధి మరచి ఇసుక, మట్టి, భూ కబ్జాలు, ధనార్జనే ధ్యేయంగా పాలన సాగించారన్నారు. వారికి ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు.


ఇల్లూరులో...


పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవంలో పాల్గొన్న నాయకులు

# టీడీపీ కార్యాలయం ప్రారంభం

**అనంతపురం రూరల్, మార్చి 21:** మండలంలోని రాచానపల్లి పంచాయతీ సిండికేట్ నగర్‌లో టీడీపీ కార్యాలయాన్ని గురువారం ప్రారంభించారు. మండల కన్వీనర్ జింకా సూర్యనారాయణ, మాజీ జడ్పీటీసీ వేణుగోపాల్, మండల ప్రధాన కార్యదర్శి పాముురాయి రఘు, రాప్తాడు నియోజకవర్గం తెలుగు రైతు అధ్యక్షుడు నారాయణస్వామి ఈ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఇందులో రాచానపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు మంజునాథ్, మాజీ ఎంపీటీసీలు రమణారెడ్డి, సర్ధానప్ప, నాయకులు బిల్లా నాగరాజు, అల్లీపీరా, బుల్లెట్ రఫీ, ఎర్రిస్వామి, ఆంజనేయులు, ఓబులపతి, రాజేష్, బాబావలి, క్రిష్ణ, రాజా, మల్లికార్జున, ఆదినారాయణ, ఈశ్వర్‌రెడ్డి, రవి, వీరేష్ పాల్గొన్నారు.

# కోడ్ ఉల్లంఘిస్తే ఫిర్యాదు చేయండి

పరిటాల సునీత

**అనంతపురం అర్బన్, మార్చి 21:** ఎన్నికల ప్రచారంలో వైసీపీ నాయకుల బరితెగింపులపై దృష్టి సారించాలని, వారు కోడ్ ఉల్లంఘిస్తే వెంటనే అధికారులకు ఆధారాలతో ఫిర్యాదు చేయాలని మాజీ మంత్రి పరిటాల సునీత సూచించారు. గురువారం అనంతపురంలోని తన క్యాంపు కార్యాలయంలో రాప్తాడు నియోజకవర్గం టీడీపీ కన్వీనర్లు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, ముఖ్యనాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వ అధికారులు, సిబ్బంది, వలంటీర్లు ఎవరైనా వైసీపీ ప్రచారంలో పాల్గొంటే ఆధారాలతోసహా ఫిర్యాదు చేయాలన్నారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినందున అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎక్కడ ప్రచారం నిర్వహించినా స్థానిక అధికారులతో ముందస్తుగా అనుమతులు తీసుకోవాలన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి పరిటాల సునీత

## మహిళ ఆత్మహత్య

**అనంతపురం క్రైం, మార్చి 21:** తాను పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి వచ్చానని... ఇక తనకు ఉద్యోగం రాదని మనస్థాపానికి గురైన ఓ మహిళ గురువారం ఆత్మహత్య చేసుకుంది. అనంతపురం రూరల్ మండలం బసవతారకనగర్‌లో వెంకటేష్, వందన (23) నివాసముంటున్నారు. పక్కింటావిడ నారాయణమ్మతో నీటి కుళాయి విషయంలో చిన్న గొడవ జరిగింది. దీనిపై నారాయణమ్మ అనంతపురం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు వారిద్దరినీ స్టేషన్‌కు పిలిపించి.. సర్ది చెప్పి పంపారు. ఇంటికెళ్లిన వందన ఇక తనకు ఇక ఉద్యోగం రాదని మనస్థాపానికి గురైంది. దీనికి తోడు ఆమె వినికిడి లోపం ఉండటంతో తనను తక్కువగా చూస్తున్నారనే అభిప్రాయంతో ఉండేది. దీంతో జీవితంపై విరక్తి చెందిన ఆమె బుధవారం రాత్రి తన ఇంట్లోని ఓ గదిలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. వందనకు ఒక పాప ఉంది. అనంతపురం రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## ఇసుక ట్రాక్టర్ల సీజ్

**శింగనమల, మార్చి 21:** అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు సీజ్ చేశారు. జాల్వకాలువ కూతలేరు వంక నుంచి బుధవారం రాత్రి అక్రమంగా ఇసుక తరలిస్తుండగా.. ఏఎస్ఐ చితంబరయ్య దాడి చేసి.. ఆ రెండు ట్రాక్టర్లను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

## మట్కా బీటర్ అరెస్టు

**గార్లదిన్నె, మార్చి 21:** గార్లదిన్నెలో మట్కాబీటర్ మహబూబ్‌బాషాను గురువారం సాయంత్రం అరెస్టు చేసినట్లు ఎస్ఐ గౌస్‌బాషా తెలిపారు. అతని నుంచి రూ. 50 వేలు నగదు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

## రంగస్థల నటుడు ఆర్వీ ప్రసాద్ మృతి



**అనంతపురం కల్చరల్, మార్చి 21:** రంగస్థల నటుడు, చిత్రకారుడు, లలితకళా పరిషత్ సహాయ కార్యదర్శి ఆర్వీ ప్రసాద్ మరణించారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం తుదిశ్వాస విడిచారు. లలితకళా పరిషత్ కార్యవర్గంతో పాటు పలువురు కళాకారులు నగరంలోని ఆయన నివాసానికి చేరుకుని భౌతికకాయానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎల్‌కేపీ అధ్యక్షుడు వెంకటసుబ్బయ్య, ప్రధాన కార్యదర్శి పద్మజ, ఉపాధ్యక్షుడు రామగోవింద్‌సాగర్ పాల్గొన్నారు.

## ఎన్నికల తర్వాత డీఎస్సీ పరీక్షలు నిర్వహించండి

**అనంతపురం అర్బన్, మార్చి 21:** సార్వత్రిక ఎన్నికల తర్వాత డీఎస్సీ పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు లేఖ పంపినట్లు యూత్ ఎడ్యుకేషన్ ఎంప్లాయ్‌మెంట్ అండ్ వెల్ఫేర్ అసోషియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు గైబువల్లి గురువారం తెలిపారు. ఈనెల 30 నుంచి ఏప్రిల్ 30 వరకు నిర్వహించే డీఎస్సీ పరీక్షలను ఎన్నికల పోలింగ్, ఫలితాల తర్వాత నిర్వహించాలని కోరినట్లు ఆయన తెలిపారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో డీఎస్సీ నోటిఫికేషన్‌ను పక్కన పెట్టి, ఎన్నికల సమయంలో హడావుడిగా టెట్, డీఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదల చేసి అభ్యర్థులకు ప్రభుత్వం ఇబ్బందులు కలిగిస్తోందని, దీన్ని దృష్టిలో ఉంచుకొని తగు నిర్ణయం తీసుకోవాలని ఆ లేఖలో కోరినట్లు ఆయన తెలిపారు.

## చీనీ కాయలు టన్ను రూ.22 వేలు

**అనంతపురం రూరల్, మార్చి 21:** అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో గురువారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.22 వేలు, కనిష్ఠంగా రూ.10 వేలు, సరాసరి రూ.15 వేలతో అమ్ముడు పోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 249 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

## శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే చర్యలు

**చెన్నేకొత్తపల్లి, మార్చి 21:** ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే కఠిన చర్యలు తప్పవని ట్రైనీ డీఎస్పీ పృథ్వీతేజ హెచ్చరించారు. మండలంలోని కనుముక్కల గ్రామంలో గురువారం సాయుధ బలగాల కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎన్నికల నిబంధనలను కచ్చితంగా పాటించి సహకరించాలని సూచించారు. గ్రామాలలో ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలన్నారు. కార్యక్రమంలో రామగిరి సీఐ శివాంజనేయులు, ఎస్ఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## కోడ్ ఉల్లంఘిస్తే సమాచారమివ్వండి

**శింగనమల, మార్చి 21:** శింగనమల నియోజకవర్గంలో ఎవరైనా ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే వెంటనే ఆధారాలతో ఫిర్యాదు చేయాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీను వెన్నెల తెలిపారు. గురువారం శింగనమల తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీ నాయకులతో నిర్వహించిన సమావేశంలో అయన మాట్లాడారు. ఎన్నికల ప్రచారంలో వలంటీర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉద్యోగులు పాల్గొంటే వెంటనే సమాచారం ఇవ్వాలని, ఆధారాలతో నిరూపిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని అన్నారు. కార్యక్రమంలో ఆరు మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలు, టీడీపీ, సీపీఐ, సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

## ఓటు హక్కును సద్వినియోగం చేసుకోండి

**అనంతపురం సెంట్రల్, మార్చి 21:** ప్రతి ఒక్కరూ ఓటును సద్వినియోగం చేసుకోవడం బాధ్యతగా భావించాలని డిప్యూటీ ఎమ్మార్వో పద్మావతి సూచించారు. గురువారం ఎస్వీ డిగ్రీ కళాశాలలో ఓటు హక్కుపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. 18 ఏళ్లు నిండిన ప్రతి విద్యార్థి ఓటురుగా నమోదు చేసుకోవాలని, ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధమని, దానిని సక్రమంగా వినయోగించుకొని సమర్థవంతమైన నాయకులను ఎన్నుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ చైర్మన్ చక్రధరరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, ఏఓ శ్రీనాథ్ పాల్గొన్నారు.

# వైసీపీ హయాంలో పెన్షనర్లకు మానసిక క్షోభ

**అనంతపురం ప్రెస్‌క్లబ్, మార్చి 21:** వైసీపీ ప్రభుత్వ తీరుతో పెన్షనర్లు తీవ్ర మానసిక క్షోభను అనుభవిస్తున్నారని పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్దనగౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం స్థానిక ఎన్జీఓ హోంలో నిర్వహించిన ఆ సంఘం జిల్లా స్థాయి కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం 11వ పీఆర్సీ అరియర్స్, డీఆర్ అరియర్స్‌పై జాప్యం చేయడం బాధాకర మన్నారు. గతంలో ఏ ప్రభుత్వం ఇంత దారుణంగా వ్యవహరించలేదని మండిపడ్డారు. కమ్యుటేషన్‌ను 15 సంవత్సరాల నుంచి 13 సంవత్సరాలకు కుదించాలని, 70 సంవత్సరాలకు ఇచ్చే అడిషనల్ క్వాంటమ్ ఆఫ్ పెన్షన్‌ను 65 సంవత్సరాలకే ఇవ్వాలని చూడటం బాధాకరమన్నారు. 12వ పీఆర్సీని కేవలం నామ మాత్రంగా చెప్పి ఇంతవరకూ ఎలాంటి చర్యలు తీసుకోక పోవడం అన్యాయ మన్నారు. ఈ సందర్భంగా పెద్దన గౌడ్‌ను సన్మానించారు. సమావేశంలో మీనాక్షమ్మ స్వచ్ఛంద సేవాసంస్థ అధినేత రవికాంత్ రమణ, సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శీలా జయ రామప్ప, జిల్లా కోశాధికారి రామకృష్ణ, అసోసియేట్ ప్రెసి డెంట్ ఎండీ ఖలందర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రభాకర్, పెన్షనర్లు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్దనగౌడ్

# ఉపాధిలో 'వైసీపీ' అక్రమాలపై చర్యలు తీసుకోండి

**అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 21:** ఉపాధి హామీ పథకంలో అక్రమాలకు పాల్పడిన వైసీపీ నాయకులపై చర్యలు తీసుకోవాలని సీపీఎం అనుబంధ ఏపీ వ్యవసాయ కార్మికసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక డ్వామా కార్యాలయంలో పీడీ వేణుగోపాల్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం కృష్ణమూర్తి మాట్లాడుతూ... ఉపాధి హామీ పథకంలో పనులు చేయకుండానే చేసినట్లు, మొక్కలు నాటకుండానే నాటినట్లు చూపిస్తూ అవినీతి, అక్రమాలకు పాల్పడిన వైసీపీ నాయకుల అవినీతిని ఆధారాలతో అందజేశామని తెలిపారు. బుక్కరాయసముద్రం మండలంలోని పసలూరు, చెదుల్ల, జంతులూరు గ్రామాల్లో అధికార పార్టీ నాయకులు సుమారు రూ. ఏడు లక్షలు వరకు ఉపాధి నిధులు దుర్వినియోగం చేశారని ఆరోపించారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని విచ్చలవిడిగా పేదల సొమ్ము ఉపాధి నిధులు మెక్కేస్తున్న వైసీపీ నాయకులు, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని, లేకుంటే ఉద్యమం చేపడుతామని హెచ్చరించారు. దీనికి డ్వామా పీడీ స్పందిస్తూ... పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సూరి, నాయకులు నాగలింగయ్య, ఎర్రిస్వామి, శ్రీనివాసులు, పుల్లన్న, గిరి, సూర్య పాల్గొన్నారు.


డ్వామా పీడీకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు



## లాక్రోస్ జాతీయ శిక్షణ శిబిరం ప్రారంభం

**అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 21:** లాక్రోస్ క్రీడా జాతీయ శిక్షణ శిబిరాన్ని స్థానిక వేణుగోపాల్ నగర్ లోని సాఫ్ట్‌బాల్ స్టేడియంలో గురువారం ప్రారంభించారు. ఎంపికైన ఏపీ రాష్ట్ర లాక్రోస్ బాలుర జట్టులో... నవీన్‌కుమార్, ఆంధ్రయహ్, ప్రవీణ్, వెంకటేష్, శాంతరాజ్, శివ, మహేష్, శ్రీనివాసరెడ్డి ఉన్నారు. బాలికల జట్టులో... శ్రీలక్ష్మి, ఫాతిమా, సింధుప్రియ, వీ శ్రీలక్ష్మి ఉన్నారు. ఈనెల 29 నుంచి ఆగ్రాలో నిర్వహించే జాతీయ లాక్రోస్ చాంపియన్ టోర్నీలో పాల్గొంటారు.

← శిక్షణా శిబిరం ప్రారంభోత్సవంలో క్రీడాకారులు

## ఘనంగా రామ్‌చరణ్ జన్మదినం

**అనంతపురం ప్రెస్‌క్లబ్, మార్చి 21:** సినీ హీరో రామ్‌చరణ్ జన్మదిన వేడుకలను ఆయన అభిమానులు గురువారం హౌసింగ్ బోర్డులోని ఆంజనేయస్వామి ఆలయంలో ఘనంగా నిర్వహించారు. రామ్‌చరణ్ అభిమానుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఇమామ్ హుస్సేన్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామ్‌చరణ్ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత స్థానాలు అధిరోహించాలని ప్రార్థించారు.



## మినహాయింపు ఇవ్వండి: యూటీఎఫ్

**అనంతపురం విద్య, మార్చి 21:** దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న ఉపాధ్యాయులకు ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరప్ప, జిల్లా అధ్యక్షుడు గోవిందరాజులు, ప్రధాన కార్యదర్శి లింగమయ్య డీఈఓ వరలక్ష్మిని కోరారు. గురువారం డీఈఓను ఆమె చాంబర్‌లో కలిసి వినతి పత్రం అందజేశారు. గతంలో డీఈఓ ఆఫీస్ నుంచి ఎక్సెల్ షీట్ ద్వారా ఉపాధ్యాయుల వివరాలను పంపమని డీడీఓలను అడిగారని, డీడీలు ఎక్సెల్ షీట్‌లో రిమార్క్స్ కాలంలో దీర్ఘకాలిక రోగాలు, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న, చంటి బిడ్డ తల్లులు, గర్భిణుల టీచర్ల వివరాలు పంపించారని అన్నారు. అయితే కలెక్టరేట్ నుంచి అడుగుతున్న లిస్టుల్లో ఆయా టీచర్ల వివరాలు కనిపించడం లేదన్నారు. కలెక్టరేట్‌లో అడిగితే తమ శాఖ నుంచి వచ్చిన వాటినే పరిశీలిస్తున్నామని అంటున్నారన్నారు. మరోసారి పలు జబ్బులతో బాధపడే టీచర్ల వివరాలు సేకరించి.. కలెక్టరేట్‌కు పంపాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు సుబ్బరాయుడు, చంద్ర మోహన్, వెంకటనాయుడు, నాగేంద్ర, సంపత్‌కుమార్, రామాంజినేయులు, శ్రీరాములు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## వృద్ధులకు 'స్వీప్'పై అవగాహన

**అనంతపురం ప్రెస్‌క్లబ్, మార్చి 21:** స్థానిక ఎన్జీఓ హోంలో వృద్ధుల సంక్షేమశాఖ ఏడీ అబ్దుల్ రసూల్ ఆధ్వర్యంలో స్వీప్ సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్ అనే అంశంపై గురువారం అవగాహన కల్పించారు. పోలింగ్ కేంద్రాల్లో వృద్ధుల కోసం కల్పిస్తున్న సౌకర్యాలను ఆయన పలువురు వృద్ధులకు వివరించారు. అనంతరం ఎలక్షన్ కమిషన్ రూపొందించిన పోస్టర్‌ను ఆయన పలువురు వృద్ధులు, పెన్షనర్లతో కలిసి విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని పలువురు ప్రభుత్వ పెన్షనర్లు, వృద్ధులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏడీ అబ్దుల్ రసూల్, పెన్షనర్లు

## పరిశోధనలతో నైపుణ్యాల పెరుగుదల

**అనంతపురం సెంట్రల్, మార్చి 21:** పరిశోధనలతో విద్యార్థుల్లో నైపుణ్యాలు పెరుగుతాయని సెంట్రల్ యూనివర్సిటీ డీన్ షీలారెడ్డి పేర్కొన్నారు. గురువారం వర్సిటీ తెలుగుశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యార్థి సదస్సులో ఆమె మాట్లాడారు. పరిశోధనల ద్వారా బాధ్యాయుత సమాజం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు గురజాడ, అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

**అనంతపురం సెంట్రల్, మార్చి 21:** పరిసరాల పరిశుభ్రతపై అనంతలక్ష్మి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు గురువారం ఇటుకలపల్లిలో అవగాహన కల్పించారు. స్థానిక ఆరోగ్య కేంద్రంలో చెత్తచెదారాన్ని తొలగించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓలు ఖలీల్‌బాషా, నవీన్ కుమార్ పాల్గొన్నారు.

## కవితా దినోత్సవం

**అనంతపురం సెంట్రల్, మార్చి 21:** స్థానిక కేఎస్ఎన్ ప్రభుత్వ మహిళా కళాశాలలో కవితా దినోత్సవ వేడకలను గురువారం ఘనంగా నిర్వహించారు. సమాజాన్ని అజ్ఞానం నుంచి విజ్ఞానం వైపు మేల్కొలిపే ఆయుధమే కవిత్వమని ప్రిన్సిపాల్ డాక్టర్ శంకరయ్య అన్నారు. అక్షరాలే ఆయుధాలుగా ప్రజలను చైతన్యవంతులుగా తీర్చిదిద్దంలో కవిత్వం ముఖ్య పాత్రపోషించిందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు శశాంకమౌళి, రామకృష్ణ, అంజన్‌రెడ్డి, పర్వీన్ పాల్గొన్నారు.

## లక్ష్మీశ్యామ్‌కు తెలుగు వెలుగు కవితా పురస్కారం

**అనంతపురం కల్చరల్, మార్చి 21:** ప్రపంచ కవితా దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలుగు వెలుగు సాహిత్య సామాజిక సేవా సంస్థ నగరానికి చెందిన బాల సాహిత్య కవయిత్రి కల్లమడి లక్ష్మీశ్యామ్‌ను తెలుగు వెలుగు కవితా పురస్కారానికి ఎంపిక చేసింది. గురువారం స్థానిక ఆ సంస్థ కార్యాలయంలో లక్ష్మీశ్యామ్‌కు ఆ సంస్థ అధ్యక్షుడు టీవీ రెడ్డి పురస్కారం అందజేసి సత్కరించారు. ఇందులో తెలుగు వెలుగు సాహిత్య సామాజిక సేవా సంస్థ కార్యదర్శులు మస్తానప్ప, లక్ష్మీదేవి, సామాజిక కార్యకర్త కేవీఎస్ చలపతిరెడ్డి పాల్గొన్నారు.


లక్ష్మీశ్యామ్‌ను సత్కరిస్తున్న దృశ్యం

## ఆర్ట్స్ కళాశాలలో కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం

**అనంతపురం సెంట్రల్, మార్చి 21:** ఆర్ట్స్ కళాశాలలో కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రిన్సిపాల్ దివాకర్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. కళాశాలలోని సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని మెరుగైన ఉపాధి అవకాశాలు పొందాలని ఆయన విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఏఓ రమణ, అధ్యాపకులు పాల్గొన్నారు.


ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్

## ముగిసిన బ్రహ్మోత్సవాలు

**ఉరవకొండ, మార్చి21:** పట్టణంలోని చంద్రమౌళీశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు గురువారం వసంతోత్సవంతో ముగిశాయి. ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉత్సవమూర్తిని పల్లకిలో ఎదురుబసవన్న గుడి వరకూ ఊరేగించారు. అనంతరం గవిమఠం ఆవరణలో ఉన్న బావి వద్ద గంగ పూజను చేశారు. కంకణధార మండపంలో మట్టికుండలలో మొలకెత్తిన నవధాన్యాలను బావిలోకి వదిలారు. సాయంత్రం అర్చకులు వసంతాలను చల్లుకున్నారు. ఉత్తరాధికారి కరిబసవ రాజేంద్రస్వామి, గవిమఠ సహాయ కమిషనర్ చిట్టెమ్మ, అర్చకులు పాల్గొన్నారు.


అలంకరణలో స్వామివారు

## విజిలెన్స్ దాడులు

**అనంతపురం న్యూటౌన్, మార్చి21:** జిల్లాలోని పలు హోటల్స్, బేకరీలపై దాడులు నిర్వహించారు. గుత్తి పట్టణంలోని ఐదు ప్రాంతాల్లో తనిఖీ చేశారు. న్యూ అన్నపూర్ణ, బెంగళూరు బేకరి, చందు కేక్ హౌస్, రవితేజ రెస్టారెంట్, హైదరాబాద్ చెఫ్ బిర్యానీ హౌస్‌లలో పరిశీలించారు. అక్కడ అక్రమాలు చోటు చేసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. పరిసరాలు పరిశుభ్రంగా లేనట్లు తేల్చారు. నిషేధిత ప్లాస్టిక్‌ను వినియోగిస్తున్నట్లు వెలుగులోకి వచ్చిందన్నారు. రూ.42 వేలు అపరాధ రుసుం విధించామన్నారు. తనిఖీల్లో సీఐ వెంకటరమణ, ఏఈఈ రవీంద్రనాథ్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## వృద్ధురాలు సజీవదహనం

**అనంతపురం క్రైం, మార్చి 21:** స్థానిక హెచ్చెల్సీ కాలనీలో నివాసముంటున్న సావిత్రమ్మ (93) గురువారం రాత్రి సజీవ దహనమైంది. రాత్రి ఆమె కుమారుడు పని మీద బయటకు వెళ్లాడు. కోడలు గుడికి వెళ్లింది. సావిత్రమ్మ ఇంట్లో ఒంటరిగా ఉండగా.. ఆమె చీరకు దీపం నుంచి నిప్పు అంటుకుంది. క్షణాల్లో చీర మొత్తానికి మంటలు చెలరేగడంతో ఆమె సజీవదహనమైంది. త్రీటౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


బీకేఎస్‌లో రామలింగారెడ్డి, పసుపుల హనుమంతరెడ్డి, పర్వతనేని శ్రీధర్‌బాబు, అశోక్ ప్రచారం


చెన్నేకొత్తపల్లి మండలం వెంకటంపల్లిలో టీడీపీ మండల కన్వీనర్ ముత్యాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం


రామగిరి మండలం పోలేపల్లిలో టీడీపీ నాయకులు, కార్యకర్తల ప్రచారం


అనంతపురంరూరల్ మండలం సోములదొడ్డిలో టీడీపీ, జనసేన నాయకుల ప్రచారం


రాప్తాడు మండలం బుక్కచెర్లలో ధర్మవరపు మురళి, కన్వీనర్ కొండప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు ప్రచారం


నార్పల మండలం రంగాపురంలో ప్రచారం చేస్తున్న ఆలం నరసానాయుడు

**PUBLIC NOTICE**

Iam instructed by my client M/s Shriram Finance Ltd., Kadapa Branch-1, rep. by its Manager, the public is notified as follows : Sri one **Smt. Shaik Mallika Shahaz** S/o **S.Md. Naveed,** r/o D.No. 8/188-1, Almaspeta, Kadapa Town & District, has applied for loan to our firm and after going through documents of her right over the below mentioned property, my client-firm decided to grant loan to her. If anybody has got any right/possession and title over the property or if any litigation is pending in any Court of Law, it shall be brought to the notice of my client, with documentary proof, within A Week from the date of this notice, failing which my client will disburse the loan amount. Any objections received after five days, they will not be taken into account. **SCHEDULE :** The property is situated in Rapthadu Village field of Rapthadu Panchayat Area of Ananthapuramu Rural SRD & Ananthapuramu RD with the following Particulars : Babu Nature - Govt. Dry, Sy. No. - 627/4, A.C. 3.26 Paiki, A.C.- 0.49 **With the Boundaries of :** East - Land of Sy.Nos. 628 & 629, South - Plots laid out in Sy. No. 627-5B, West - 40 feet road, North - Land of Sy.No. 627-3. **Within the above boundaries an extent of Ac. 0.49 cents.**

Y. RAMESWARA REDDY
ADVOCATE, ANANTAPURAMU

## టీడీపీ విజయానికి సమష్టి కృషి

● తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీపీఆర్


మాట్లాడుతున్న జేసీ ప్రభాకర్ రెడ్డి

**యాడికి, మార్చి 21:** సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయదుందుభి మోగించడానికి కార్యకర్తలు, నాయకులు సమష్టిగా కృషిచేయాలని తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం యాడికి, టి. కొత్తపల్లి గ్రామాల్లో ఉన్న టీడీపీ నాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికి వెళ్లి టీడీపీ మేనిఫెస్టోను వివరించాలన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలని సూచించారు. చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలతో ప్రజలకు ఎంత మేలు జరుగుతుందో తెలియజేయాలన్నారు. పార్టీ గెలుపుకోసం కష్టపడే ప్రతి కార్యకర్తను, నాయకుడిని గుర్తుంచుకుంటానని ఆయన తెలిపారు. సమావేశంలో టీడీపీ నాయకులు ఎస్వీ రవీంద్రారెడ్డి, చవ్వా గోపాల్‌రెడ్డి, వేలూరు రంగయ్య, నాగమునిరెడ్డి, పరిమి చరణ్, కులశేఖర్‌నాయుడు, బయపురెడ్డి, శ్యాంసుందర్ నాయుడు, మాదాల అనిల్, రామచంద్రారెడ్డి, ఆదినారాయణ, తిరంపురం నీలకంఠ, రవికుమార్‌రెడ్డి, రామాంజనేయులు, సుధాకర్‌నాయుడు, బాలాంజనేయులు, దేవేంద్ర, నాగిరెడ్డి, నగరూరు నరసింహులు, రామకృష్ణారెడ్డి, రామునాయక్, శోభన్‌బాబు, జాఫర్, రామకృష్ణ, నారాయణస్వామి పాల్గొన్నారు.

### పర్వతప్ప స్వామి ఆలయంలో చోరీ

**ఉరవకొండ, మార్చి 21:** మండలంలోని రాయంపల్లి సమీపంలో ఉన్న పర్వతప్ప స్వామి ఆలయంలో గురువారం గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఉదయం అర్చకులు ఆలయం వద్దకు వెళ్లగా తాళాలు పగులగొట్టి ఉండడాన్ని గమనించారు. గ్రామస్థులు పోలీసులకు సమాచారమందించారు. గుర్తుతెలియని వ్యక్తులు ఆలయంలోకి ప్రవేశించి, హుండీని గ్యాస్ కట్టర్‌తో కట్‌చేసి సొమ్మును ఎత్తుకెళ్లారు. రూ.70వేల వరకు దోచుకెళ్లినట్లు ఆలయ కమిటీ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

### మహిళ మెడలో బంగారు గొలుసు అపహరణ

**గుంతకల్లుటౌన్, మార్చి 21:** పట్టణంలోని బీమిరెడ్డి కాలనీలో నివాసముంటున్న సుజాత అనే మహిళ ఆలయానికి వెళ్తుండగా ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు ద్విచక్రవాహనంలో వచ్చి ఆమె మెడలో ఉన్న బంగారు గొలుసును గురువారం లాక్కెళ్లారు. సుజాత ఉదయం ఆంజనేయస్వామి ఆలయానికి వెళ్తుండగా గుర్తుతెలియని వ్యక్తులు ద్విచక్రవాహనంలో వెనుక నుంచి వచ్చి ఆమె మెడలో ఉన్న రెండు తులాల బంగారు చైన్‌ను లాక్కెళ్లారు. బాధితురాలు రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు.

### చైన్ స్నాచింగ్‌కు యత్నం

**తాడిపత్రిటౌన్, మార్చి 21:** పట్టణంలోని పప్పూరురోడ్డులో నివాసం ఉంటున్న మంజులకు చెందిన బంగారుచైన్‌ను గురువారం గుర్తుతెలియని ముగ్గురు దుండగులు ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నించారు. స్థానికులు తెలిపిన వివరాలమేరకు శ్రీరాములు, మంజుల భార్యభర్తలు ఇంటివద్దే కిరాణా దుకాణం నిర్వహిస్తున్నారు. గురువారం మధ్యాహ్నం దుకాణానికి గుర్తుతెలియని వ్యక్తి వచ్చి కూల్‌డ్రింక్ కావాలని అడిగాడు. అప్పటికే బైక్‌పై సిద్ధంగా ఉన్న మరో ఇద్దరు కూల్‌డ్రింక్ ఇస్తున్న మంజుల మెడలోని బంగారు చైన్‌ను బలంగా లాగాడు. దీంతో చైన్ తెగిపోవడంతో సదరు దొంగ బైక్‌పై ఎక్కాడు. అనుమానం వచ్చిన దొంగ చైన్‌ను పరిశీలించగా రోల్డ్‌గోల్డ్ అని భావించి అక్కడే పడేశాడు. కానీ వాటిలోని తాళిబొట్టు, గిన్నెబొట్టులను మాత్రం దోచుకొని పప్పూరువైపు వెళ్లారని స్థానికులు తెలిపారు. పడేసిన చైన్‌ను బాధితులు తీసుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి ఆరాతీశారు.

### వ్యక్తిపై కేసు నమోదు

**తాడిపత్రిటౌన్, మార్చి21:** మండలంలోని గంగాదేవిపల్లి గ్రామానికి చెందిన ప్రసాద్‌పై కేసు నమోదుచేసినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. రెండురోజులక్రితం పుట్లూరు మండలం జీసీపల్లికి చెందిన ఎక్స్‌కవేటర్ ఆపరేటర్ పెద్దిరాజును పనికి రావాలంటూ ప్రసాద్ పిలిచాడు. తాను రాలేనని చెప్పడంతో ఆగ్రహానికి గురైన ప్రసాద్ పెద్దిరాజుపై దాడిచేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు ప్రసాద్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

### మహిళ ఆత్మహత్య

తాడిపత్రి పట్టణంలోని జయనగర్‌కాలనీకి చెందిన రమాదేవి (46) అనే ఒంటరి మహిళ గురువారం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు పట్టణ పోలీసులు తెలిపారు. రమాదేవి ఒంటరిగా ఉంటూ చిట్టీలు నడుపుతూ జీవనం సాగించేది. చిట్టీలు పూర్తిచేసిన వారికి డబ్బులు ఎలా చెల్లించాలో తెలియక మదనపడి గురువారం ఉదయం ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. సోదరుడు హరిప్రసాద్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు పోలీసులు తెలిపారు.

### చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

**బెళుగుప్ప, మార్చి 21:** మండలంలోని ఆవులెన్న గ్రామానికి చెందిన నరసింహులు(40) రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు గత ఏడాది 27న కళ్యాణదుర్గం నుంచి స్వగ్రామానికి బైకులో వస్తుండగా చాపిరి గ్రామ సమీపంలో అదుపుతప్పి కిందపడ్డాడు. తలకు బలంగా గాయాలు కావడంతో బెంగళూరు, కర్నూలు ఆస్పత్రులలో చికిత్సలు చేయించినా న యం కాలేదు. మృతుడికి భార్య మమత, కుమార్తె దీక్షిత, కుమారుడు ప్రవీణ్ ఉన్నారు. ప్రభుత్వం బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలంటూ స్థానికులు కోరారు.

### మద్యం ప్యాకెట్ల స్వాధీనం

**గుంతకల్లుటౌన్, మార్చి 21:** పట్టణంలోని మోదీనాబాదులో బోయ రామాంజనేయులు అనే వ్యక్తి నుంచి కర్ణాటక మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు వన్‌టౌన్ సీఐ రామసుబ్బయ్య గురువారం తెలిపారు. మద్యం విక్రయిస్తున్నాడన్న సమాచారం మేరకు దాడులు నిర్వహించి రామాంజనేయులు నుంచి 14 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. అతనిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

### మున్సిపల్ కార్మికుడి మృతి

**రాయదుర్గంరూరల్, మార్చి 21:** పట్టణంలో మున్సిపల్ కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్న బాలకృష్ణ(35) అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో పనిచేస్తున్న బాలకృష్ణ వారంరోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స తీసుకున్నట్లు తెలిపారు. గురువారం ఉదయం ఆరోగ్యం క్షీణించడంతో పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

## చోరీని అడ్డుకున్నందుకు దాడి

● ముగ్గురికి గాయాలు


బాధితులను పరామర్శిస్తున్న టీడీపీ నాయకుడు పవన్‌కుమార్ గౌడ్

**గుంతకల్లు టౌన్, మార్చి 21:** దొడ్లోని పశుగ్రాసాన్ని ఎత్తుకెళుతున్నారని అడ్డుకున్నందుకు ముగ్గురిపై దాడిచేసిన ఘటన మండలంలోని నాగసముద్రం గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల మేరకు రామకృష్ణకు చెందిన 8 సెంట్ల స్థలాన్ని వెంకటరాముడు 8 నెలల క్రితం అద్దెకు తీసుకున్నాడు. వెంకటరాముడు ఆ స్థలంలో పశుగ్రాసం, వరిగడ్డి వేసుకున్నాడు. అయితే ప్రతి రోజూ తమ పశుగ్రాసం మాయమవుతోందని, ఎవరో ఎత్తుకెళ్తున్నారని గ్రహించారు. గురువారం ఉదయం పశుగ్రాసాన్ని రమేష్ కుటుంబసభ్యులు ఎత్తుకెళుతుండటాన్ని గమనించి వెంకటరాముడు వారిని నిలదీశాడు. దీంతో రమేష్, అతని భార్య తిప్పక్క, కుమారులు రవి, హరీష్ కళ్లలో కారంపొడి చల్లి కట్టెలతో దాడి చేశారు. ఈ ఘటనలో పద్మావతి, శ్రీనివాసులు, నరసింహులు గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో బాధితులను టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆర్ పవన్‌కుమార్‌గౌడ్, యువనాయకుడు అనిల్‌గౌడ్, నాయకులు రామన్నచౌదరి, రాము పరామర్శించారు. అలాగే గుమ్మనూరు నారాయణ, శ్రీనివాసులు, మాజీమంత్రి జయరాం కుమారుడు ఈశ్వర్ పరామర్శించిన వారిలో ఉన్నారు.

# కలసికట్టుగా టీడీపీని గెలిపిద్దాం: అమిలినేని


సురేంద్రబాబును సన్మానిస్తున్న బ్రహ్మసముద్రం, కుందుర్పి మండలాల నాయకులు

**కళ్యాణదుర్గం, మార్చి 21:** కలిసికట్టుగా నియోజకవర్గంలో టీడీపీని గెలిపించుకుందామంటూ ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు పిలుపునిచ్చారు. గురువారం ఆయన స్వగృహంలో కుందుర్పి, బ్రహ్మసముద్రం మండల టీడీపీ నాయకులు అమిలినేనికి పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. వారితో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ రోజు ఏ గ్రామంలో చూసినా టీడీపీకి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. అదేస్ఫూర్తితో మనమందరం సమష్టిగా కృషి చేసి అత్యధిక మెజార్టీతో గెలిపించుకుందామని అన్నారు. సూపర్‌సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించి టీడీపీని ఆదరించాలని పెద్దఎత్తున ప్రచారం చేపట్టాలన్నారు. ఏ సమస్య వచ్చినా నేరుగా తన దృష్టికి తీసుకువస్తే అక్కడికక్కడే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**స్వర్ణకారులకు అండగా వుంటాం:** పట్టణంలోని స్వర్ణకారులకు అండగా ఉంటామని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు భరోసా ఇచ్చారు. గురువారం పట్టణంలోని ఆయన స్వగృహంలో స్వర్ణకారులంతా కలిశారు. రాజగోపాల్ ఆధ్వర్యంలో వంద మందికిపైగా ఉన్నారు. గిరీష్ అనే వ్యక్తి కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడని, ఆదుకోవాలని కోరారు. స్పందించిన సురేంద్రబాబు అతనికి వైద్యం చేయిస్తామని హామీ ఇచ్చారు. అడిగిన వెంటనే స్పందించిన ఆయనకు స్వర్ణకారులు కృతజ్ఞతలు తెలిపారు.

**బాధిత కుటుంబానికి టీడీపీ అండ:** పట్టణంలోని ట్రాన్స్‌కో కార్యాలయం వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కంబదూరు మండలం ఎగువపల్లి గ్రామానికి చెందిన గోపాల్ మృతి చెందడంతో భౌతికకాయానికి టీడీపీ అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు నివాళులర్పించారు. కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. బాధిత కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని అన్నారు. ప్రమాదంలో గాయపడిన మరో ఇద్దరు కుమారులను కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స చేయిస్తామని హామీ ఇచ్చారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కరణం రామ్మోహన్ చౌదరి, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి అమిలినేని లక్ష్మీనారాయణ వున్నారు.


స్వర్ణకారులకు నమస్కరిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి సురేంద్రబాబు

# టీడీపీకి ఓటు వేసి రాష్ట్రాన్ని కాపాడండి


డి. హీరేహాళ్‌లో ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

**డి.హీరేహాళ్, మార్చి 21:** వచ్చే సార్వత్రిక ఎన్నికలలో ప్రతి ఒక్కరూ తెలుగుదేశం పార్టీకి ఓటు వేసి రాష్ట్రాన్ని కాపాడుకోవాలని ఆ పార్టీ మండల కన్వీనర్ హనుమంతరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి మోహన్‌రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. మండలంలోని సిద్ధాపురం, మలపనగుడి గ్రామాలలో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మండల వ్యాప్తంగా సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. వైసీపీ జగన్ మోహన్‌రెడ్డి పాలనతో రాష్ట్రం రావణకాష్టంగా మారిందని విమర్శించారు. ఎంపీటీసీ గంగాధర, మల్లికార్జున, రామాంజనేయులు, సోమన్నగౌడ, వెంకటేష్, బసప్ప, తాయప్ప, తిప్పేస్వామి, వన్నూరుస్వామి, రాజశేఖర్, కృష్ణమూర్తి, తిమ్మప్ప, నర్సింగ్‌నాయక్, ఉమేష్, చిన్న, వీర, గోపాల్ పాల్గొన్నారు.

**బొమ్మనహాళ్:** వైసీపీ ఆటవిక రాజ్యానికి చరమగీతం పాడేందుకు సమయం ఆసన్నమైందని మండల కన్వీనర్ బలరాంరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని శ్రీధరఘట్ట గ్రామంలో బాబుష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా సూపర్‌సిక్స్ పథకాలను ఇంటింటికి తిరుగుతూ వివరించారు. మాజీ ఎంపీటీసీ తిప్పేస్వామి, టీడీపీ నాయకులు రవిచంద్రసాగర్, ఎర్రిస్వామి, అనిల్‌కుమార్, పోతప్ప, మల్లికార్జున పాల్గొన్నారు.

**రాయదుర్గంరూరల్:** సైకిల్ గుర్తుకు ఓటు వేసి తెలుగుదేశం పార్టీని గెలిపించాలని బీసీసెల్ కార్యదర్శి పొరాళ్ల ధనార్జన కోరారు. గురువారం పట్టణంలో 28వ వార్డులో సూపర్‌సిక్స్ పథకాలపై అనంతపురం పట్టణ మైనార్టీ కమిటీ అధ్యక్షులు ఫకీర్‌జావీద్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బీఎల్ఏలు పీ గోవర్ధన్, మహేష్ పాల్గొన్నారు.


శ్రీధరఘట్టలో సూపర్‌సిక్స్ పథకాలను వివరిస్తున్న నాయకులు

## 18 కుటుంబాలు టీడీపీలో చేరిక


కాలవ శ్రీనివాసులు సమక్షంలో టీడీపీలో చేరుతున్న వైసీపీ కుటుంబాలు

**రాయదుర్గం రూరల్, మార్చి 21:** రాయదుర్గం మండలం మెచ్చిరి గ్రామానికి చెందిన 18 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీ మండల కన్వీనర్ హనుమంతు ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. గురువారం ఎమ్మెల్యే అభ్యర్థి కాలవ శ్రీనివాసులు నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారికి పార్టీ కండువాలు వేసి కాలవ పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జ్ సిద్ధప్ప, మల్లికార్జున పాల్గొన్నారు.

**రాయదుర్గం:** పట్టణానికి చెందిన అజయ్ టైలర్స్ రఘునాథ్ ఆధ్వర్యంలో 25 కుటుంబాలు గురువారం తెలుగుదేశం పార్టీలో చేరారు. మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు తన నివాసంలో వీరికి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. టైలర్ శివ, జాఫర్, సిద్ధప్ప, ప్రశాంత్, హరి, వెంకటేశులు, తేజ, అనిల్, అజయ్, పవన్‌లతో పాటు మరికొందరు పార్టీలో చేరినట్లు ప్రకటించారు. అలాగే కోతిగుట్టలోని 14వ వార్డుకు చెందిన ఐదు కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి.


వైసీపీ మద్దతుదారుడు బాషాను పార్టీలోకి ఆహ్వానిస్తున్న జేసీపీఆర్

**టీడీపీలో చేరిక**

**తాడిపత్రిటౌన్:** పట్టణంలోని ఓంశాంతినగర్‌కు చెందిన వైసీపీ మద్దతుదారుడు పెయింటర్ బాషా గురువారం టీడీపీలో చేరారు. ఆయనకు మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. నాయకులు చవ్వా గోపాల్‌రెడ్డి, ఎంఏ రంగారెడ్డి, మండల కన్వీనర్ నరేంద్రనాయుడు, మల్లికార్జునరెడ్డి, హరినాథ్‌రెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి, నాగరంగయ్య, వాసుదేవరెడ్డి, గోరా పాల్గొన్నారు.

### టీడీపీ నాయకుడి మృతి


రఘురాములు (ఫైల్)

**కణేకల్లు, మార్చి 21:** మండలంలోని ఎన్ హనుమాపురం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు చెన్నప్పరెడ్డి గారి రఘురాములు గురువారం అనారోగ్యంతో మృతి చెందాడు. పార్టీ ఆవిర్భావం నుంచి చురుకుగా పనిచేసిన రఘురాములు మృతి టీడీపీకి తీరని లోటని మండల కన్వీనర్ లాలెప్ప అన్నారు. ఆయన మృతి పట్ల గ్రామ సర్పంచ్ జయరాంచౌదరి, ఎంపీటీసీ నరేంద్ర, తూర్పింటి రఘునాథ్ తమ ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.

### కేంద్ర బలగాల కవాతు


పట్టణంలో కవాతు చేస్తున్న పోలీసులు, కేంద్ర బలగాలు

**రాయదుర్గం, మార్చి 21:** ప్రజలు నిర్భయంగా ఓటుహక్కు వినియోగించుకునేందుకు అవగాహన కల్పిస్తూ గురువారం పట్టణంలో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. పట్టణంలోని శాంతినగర్ వద్ద నుంచి బొడ్డురాయి, బళ్లారిరోడ్డు, వినాయకసర్కిల్, తేరుబజార్, లక్ష్మీబజార్, రాజీవ్ గాంధీకాలనీ, ఆర్‌అండ్‌బీ గెస్టు హౌస్, మున్సిపల్ కార్యాలయం మీదుగా పోలీస్‌స్టేషన్ వరకు కవాతు కొనసాగించారు. కళ్యాణదుర్గం డీఎస్పీ శ్రీనివాసులు, సీఐలు ప్రసాద్, శ్రీనివాస్, ఎస్ఐలు వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, గురుప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

### 108 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల గుర్తింపు

**గుంతకల్లు, మార్చి21:** నియోజవర్గంలో 108 పోలింగ్ కేంద్రాలు సమస్యాత్మకంగా ఉన్నట్లు గుర్తించామని ఆర్డీవో శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని 276 పోలింగ్ కేంద్రాల్లో 108 కేంద్రాలు ఈసీ నార్మ్స్ ప్రకారం సమస్యాత్మకమైనవిగా గుర్తించినట్లు తెలిపారు. వాటిపై ప్రత్యేక దృష్టిని నిలిపి అదనపు సిబ్బందిని కేటాయిస్తామన్నారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా పోలింగ్ కేంద్రాల్లో ఒకటి మినహా అన్నింటిలో అన్ని వసతులు కల్పించినట్లు చెప్పారు. నియోజకవర్గంలో ఐదు పోలింగ్ కేంద్రాలను ఎంపికచేసి ప్రయోగాత్మకంగా మోడల్ పోలింగ్ కేంద్రాలుగా ఏర్పాట్లు చేయనున్నట్లు వివరించారు. నియోజకవర్గంలోని 140 పోలింగ్ కేంద్రాల్లో ఆన్‌లైన్ వీడియో ప్రసారాలను ఏర్పాటుచేస్తామన్నారు. ఎన్నికల కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించడానికి ఫొటో, వీడియో రికార్డులను సేకరిస్తామని, మూడు మండలాల్లో తొమ్మిది ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించామన్నారు. సమావేశంలో గుంతకల్లు, గుత్తి, పామిడి తహసీల్దార్లు శేషఫణి, భారతి, చంద్రశేఖర్ నాయక్ పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

**గుత్తి, మార్చి 21:** పట్టణంలోని కర్నూలు రోడ్డులో గురువారం ప్రమాదవశాత్తు ద్విచక్రవాహనంపై నుంచి కింద పడి వెంకటేష్ అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. చీరాలకు చెందిన వెంకటేష్ పట్టణంలో బంధువుల ఇంటికి వచ్చాడు. పని నిమిత్తం ద్విచక్రవాహనంలో బస్టాండ్ వైపు వెళ్తూ ప్రమాదవశాత్తు కర్నూలు రోడ్డులో డివైడర్‌ను ఢీకొని కిందపడి గాయపడ్డాడు. బాధితుడిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### సైకిల్‌కు ఓటువేసి అభివృద్ధికి బాటలు వేయండి


వృద్ధులను పలకరిస్తున్న జేసీ అస్మిత్‌రెడ్డి

**తాడిపత్రిటౌన్, మార్చి 21:** సైకిల్ గుర్తుకు ఓటువేసి అభివృద్ధికి బాటలు వేయాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి జేసీ అస్మిత్‌రెడ్డి కోరారు. గురువారం పట్టణంలోని ఏటిగడ్డపాలెం, బంకమట్టివీధి, పోరాట కాలనీ, పాతకోట ప్రాంతాల్లో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సూపర్‌సిక్స్ పథకాల గురించి వివరించారు. టీడీపీ మేనిఫెస్టోలోని అంశాలతోనే ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుందని అన్నారు. టీడీపీకి ఓటువేసి గెలిపించాలని ఆయన అభ్యర్థించారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి కదిరి శ్రీకాంత్‌రెడ్డి, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

### రంగు తొలగింది..


ఆర్‌బీకేకు తెల్ల రంగు వేసిన దృశ్యం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

**గుంతకల్లు, మార్చి 21:** పట్టణంలోని రైతు భరోసా కేంద్రానికి (ఆర్బీకే) వైసీపీ రంగులు తొలగించి తెలుపు రంగును వేశారు. కోర్టు ఆదేశాల మేరకు ప్రభుత్వ కార్యాలయాలకు వైసీపీ రంగులను తొలగించకుండా, ఎన్నికల కోడ్ ఉన్నా ఆర్బీకేకు వైసీపీ రంగులు అలాగే ఉంచారంటూ ఆంధ్రజ్యోతిలో గురువారం కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన వ్యవసాయ అధికారులు ఆర్బీకేకు తెలుపు రంగును వేయించారు.

### ఘనంగా నారా దేవాన్ష్ పుట్టినరోజు


అనాథ పిల్లల మధ్య కేక్ కట్ చేసిన కాలవ భరత్

**రాయదుర్గం, మార్చి 21:** టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ తనయుడు నారా దేవాన్ష్ జన్మదిన వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ప్రేమసన్నిధి ట్రస్టులో అనాథ పిల్లల మధ్య కేక్ కట్ చేసి కాలవ భరత్ ఆధ్వర్యంలో పంచిపెట్టారు. మాజీ కౌన్సిలర్ వై వెంకటేశులు అనాథపిల్లలకు రూ.2,500లు విరాళంగా అందించారు.

### అమిలినేని గెలుపునకు కుటుంబ సభ్యుల ప్రచారం


శెట్టూరులో మహిళలతో కలిసి విక్టరీ గుర్తు చూపుతున్న కుటుంబ సభ్యులు

**కళ్యాణదుర్గం, మార్చి 21:** టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు గెలుపునకు కుటుంబ సభ్యులు గురువారం పెద్దఎత్తున ప్రచారం చేపట్టారు. కళ్యాణదుర్గం మండలం బాల వెంకటాపురంలో అమిలినేని సురేంద్రబాబు భార్య రమాదేవి ఇంటింటికి వెళ్లి ప్రచారం చేపట్టారు. సూపర్‌సిక్స్ కరపత్రాలను పంచుతూ ప్రచారం చేశారు. శెట్టూరు మండలం చింతర్లపల్లిలో సురేంద్రబాబు చెల్లెళ్లు రాధ, మాధవి, సోదరుడు యర్రిస్వామి, ఆయన భార్య సునీత, వాణి, శాంతి ఇంటింటికి వెళ్లి టీడీపీని ఆదరించాలని కోరారు. టీడీపీ వస్తేనే గ్రామాలన్నీ అభివృద్ధి బాటలో నడుస్తాయన్నారు. ఏ గ్రామంలో చూసినా టీడీపీకి అపూర్వ ఆదరణ లభిస్తోందని అన్నారు. సురేంద్రబాబు గెలుపు ఖాయమని వారు ధీమా వ్యక్తం చేశారు.

గుంతకల్లు అసెంబ్లీ, అనంతపురం ఎంపీ టిక్కెట్లను

## బీజేపీకి కేటాయించాలి

● జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు


పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

**గుంతకల్లు, మార్చి 21:** అనంతపురం జిల్లా గుంతకల్లు అసెంబ్లీ స్థానాన్ని, అనంతపురం ఎంపీ స్థానాన్ని పొత్తుల్లో భాగంగా బీజేపీకి కేటాయించాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. గుంతకల్లు పట్టణంలో ఆ పార్టీ నాయకులు గురువారం ర్యాలీ నిర్వహించారు. కొందరు టీడీపీ కార్యకర్తలు కూడా ఈ ర్యాలీలో పాల్గొన్నారు. ఆ తరువాత పట్టణంలోని ఓ కల్యాణమండపంలో నిర్వహించిన బీజేపీ కార్యకర్తల సమావేశంలో సందిరెడ్డి ప్రసంగించారు. జగన్ దుర్మార్గపు పరిపాలన వల్ల రాష్ట్రం అధోగతి పాలైందని అన్నారు. ఒక్క అవకాశం అంటూ అధికారంలోకి వచ్చిన జగన్.. కేంద్రం ఇచ్చిన నిధులన్నీ దిగమింగి, రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారని విమర్శించారు. వైసీపీ దుష్ట ప్రభుత్వాన్ని గద్దె దించడానికి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఏర్పడిందని, కూటమి తప్పకుండా అధికారంలోకి వస్తుందని అన్నారు. రాజకీయ పొత్తులో భాగంగా గుంతకల్లు అసెంబ్లీ, అనంతపురం ఎంపీ స్థానాలను బీజేపీ తీసుకోవాలని పార్టీ అధిష్ఠానాన్ని కోరుతామని అన్నారు.

### ముగిసిన బ్రహ్మోత్సవాలు


అలంకరణలో స్వామివారు

**ఉరవకొండ,మార్చి21:** పట్టణంలోని చంద్రమౌళీశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు గురువారం వసంతోత్సవంతో ముగిశాయి. ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉత్సవమూర్తిని పల్లకిలో ఎదురుబసవన్న గుడి వరకూ ఊరేగించారు. అనంతరం గవిమఠం ఆవరణలో ఉన్న బావి వద్ద గంగ పూజను చేశారు. కంకణధార మండపంలో మట్టికుండలలో మొలకెత్తిన నవధాన్యాలను బావిలోకి వదిలారు. సాయంత్రం అర్చకులు వసంతాలను చల్లుకున్నారు. ఉత్తరాధికారి కరిబసవరాజేంద్రస్వామి, గవిమఠ సహాయ కమిషనర్ చిట్టెమ్మ, అర్చకులు పాల్గొన్నారు.

### తాగునీటి సమస్య పరిష్కరించండి

**ఉరవకొండ, మార్చి 21:** విడపనకల్లు మండలంలోని చీకలగురికి గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ స్ర్పీన్‌ను సర్పంచ్ పద్మావతి, ఆమె భర్త విజేత కోరారు. స్థానిక కార్యాలయంలో ఆమెను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. పంచాయతీ బోరు ఎండిపోయి 20 రోజులైందని, తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఏఈ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదన్నారు. అధికారులు కార్యాలయాల్లో ఉంటారని, గ్రామాల్లో నీళ్లు సరఫరా చేయకపోతే ప్రజలు తమను నిలదీస్తున్నారని, వారికి ఏమి సమాధానం చెప్పాలని డీఈని ప్రశ్నించారు. జగనన్న కాలనీలో ఉన్న బోరు ద్వారా నీటి సరఫరా చేసే అవకాశమున్నా చర్యలు తీసుకోవడం లేదన్నారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని డీఈ తెలిపారు.

### విజిలెన్స్ దాడులు

**అనంతపురం న్యూటౌన్, మార్చి21:** జిల్లాలోని పలు హోటల్స్, బేకరీలపై దాడులు నిర్వహించారు. గుత్తి పట్టణంలోని ఐదు ప్రాంతాల్లో తనిఖీ చేశారు. న్యూ అన్నపూర్ణ, బెంగళూరు బేకరి, చందు కేక్ హౌస్, రవితేజ రెస్టారెంట్, హైదరాబాద్ చెఫ్ బిర్యానీ హౌస్‌లలో పరిశీలించారు. అక్కడ అక్రమాలు చోటు చేసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. పరిసరాలు పరిశుభ్రంగా లేనట్లు తేల్చారు. నిషేధిత ప్లాస్టిక్‌ను వినియోగిస్తున్నట్లు వెలుగులోకి వచ్చిందన్నారు. రూ.42వేలు అపరాధ రుసుం విధించామన్నారు. తనిఖీల్లో సీఐ వెంకటరమణ, ఏఈఈ రవీంద్రనాథ్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

### వైసీపీలో చేరలేదు..

**డీ.హీరేహాళ్, మార్చి 21:** మం డలంలోని పులకుర్తి గ్రామంలో వైసీపీ ఇన్‌చార్జి మెట్టు గోవిందరెడ్డి సమక్షంలో టీడీపీ నుంచి వైసీపీలోకి 50 కుటుంబాలు చేరినట్లు సోషల్ మీడియా పలు పత్రికల ద్వారా ప్రచారం చేసుకున్న వార్తలు పూర్తిగా అవాస్తవమని టీడీపీ నాయకులు గులెప్ప, మం జు, రమేష్, నరసింహ, తిప్పయ్య మండిపడ్డారు. ఇందికి సంబంధించిన నాయకులు మాట్లాడుతూ బుధవారం పులకుర్తి గ్రామంలో వైసీపీ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ నాయకులు సమావేశం ఏర్పాటు చేశారన్నారు. టీడీపీ నుంచి 50 కుటుంబాలు వైసీపీలోకి చేరుతున్నట్లు కండువాలు కప్పుకొని ఫొటోలు దిగి పత్రికలు, సోషల్ మీడియాల ద్వారా ప్రచారం చేసుకున్నారన్నారు. అందులో ఉన్న ఏ ఒక్క నాయకుడికి టీడీపీకి సంబంధం లేదన్నారు. కనీసం ఒక్కరికి కూడా పార్టీ సభ్యత్వం లేదని, అందులో ఏ ఒక్కరు పార్టీకి పనిచేసిన సందర్భాలు లేవని అన్నారు. బసవరాజు, రామన్న, నాగరాజు, సురేష్‌స్వామి, గాదిలింగ, సుధాకర, రాముడు పాల్గొన్నారు.